1st Year Happy Work Anniversary.

షణ్ముఖ SHANMUKHAVELUGU
RNI : APTEL / 2023 / 89152
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక

Good for Health — Best for Readers — THE POWER OF RK PEN

సంపుటి : 2 సంచిక : 316 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ బుధవారం 12 నవంబర్ 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 316 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Wednesday 12 November 2025 PAGES : 8 PRICE : 3/-

# ఆలోచనతో రండి.. పారిశ్రామికవేత్తలు కండి

## సీఎం చంద్రబాబు పిలుపు



- కనిగిరిలో ఎంఎస్ఎంఈ పార్కును ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- సీఐఐ సదస్సులో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులే టార్గెట్
- గత పాలనలో పరిశ్రమలు రాష్ట్రం విడిచి పారిపోయాయన్న సీఎం
- 2026 నాటికి వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేస్తామని హామీ

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, నవంబర్ 11)

యువత మంచి ఆలోచనలతో ముందుకు వస్తే, వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే బాధ్యత తమదని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి 175 నియోజకవర్గాల్లో 'ప్లగ్ అండ్ ప్లే' విధానంలో పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేసి, లక్షలాది ఉద్యోగాలు సృష్టిస్తామని ఆయన ప్రకటించారు. ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గం పెదఈర్లపాడులో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ -మిగతా 2లో

## ఢిల్లీ పేలుడు బాధ్యులను ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టం

### ప్రధాని మోదీ హెచ్చరిక



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,నవంబర్ 11)

ఢిల్లీలోని ఎర్రకోట వద్ద బాంబు దాడి కి పాల్పడిన నిందితులను ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని ప్రధాని నరేంద్ర మోదీ హెచ్చరించారు. దేశంలోని పలు దర్యాప్తు సంస్థలు ఈ ఘటనపై దర్యాప్తును ముమ్మరం చేశాయని.. దాడికి గల కారణాలను దర్యాప్తు సంస్థల అధికారులు త్వరలో వెల్లడించనున్నారని తెలిపారు. అమాయకుల ప్రాణాలు తీసిన వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ వదలబోమని దేశ ప్రజలకు హామీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. పేలుడులో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోదీ భూటాన్ పర్యటనలో ఉన్నారు. ఆ దేశ రాజధాని థింపులో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. బాంబు పేలుడు వెనక ఉన్న కుట్రదారులను వదలబోమని.. బాధ్యులందరినీ చట్టం ముందు నిలబెడతామన్నారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్న ఏజెన్సీలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు. త్వరలో దాడికి సంబంధించిన పూర్తి వివరాలు: రాజ్‌నాథ్ సింగ్ ఢిల్లీ పేలుడు ఘటనపై దేశంలోని దర్యాప్తు సంస్థలు విచారణ జరుపుతున్నాయని.. త్వరలో ప్రమాదానికి సంబంధించిన వివరాలు వెల్లడిస్తామని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్) వెల్లడించారు. దాడికి కారణమైనవారిని వదిలిపెట్టమని.. కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేశారు.

## హిందువుల విశ్వాసాలతో ఆడుకోవద్దు: పవన్ కల్యాణ్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 11)

సనాతన ధర్మాన్ని, హిందువుల మనోభావాలను పరిరక్షించేందుకు 'సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు'ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రపంచవ్యాప్త హిందూ సమాజానికి కేవలం పుణ్యక్షేత్రం మాత్రమే కాదని, అదొక పవిత్రమైన ఆధ్యాత్మిక గమ్యస్థానం అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ, "తిరుపతి లడ్డూ కేవలం ఒక స్వీట్ కాదు, అది మనందరి ఉమ్మడి భావోద్వేగం. స్నేహితులు, కుటుంబ సభ్యులు, -మిగతా 2లో



## రాజ్యాంగ నిపుణులతో చర్చించా.. వైకాపాకు ప్రతిపక్ష హోదా కుదరదు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 11)

తనకు ప్రతిపక్ష నాయకుడి హోదా ఇవ్వాలని వైకాపా అధ్యక్షుడు జగన్ కోరుతున్నారని, అందుకు అవసరమైన ఎమ్మెల్యేలు ఆ పార్టీకి లేరని స్పీకర్ అయ్యన్నపాత్రుడు చెప్పారు. ఈ విషయంపై అన్ని రాష్ట్రాల స్పీకర్లు, రాజ్యాంగ నిపుణులతో చర్చించానని, నిర్ణీత సంఖ్య కన్నా తక్కువ సీట్లున్న పార్టీకి ప్రతిపక్ష హోదా ఇచ్చే అవకాశం లేదని వారు చెప్పినట్లు పేర్కొన్నారు. అందువల్ల వైకాపాకు ప్రతిపక్ష హోదా ఇవ్వడం కుదరదని స్పష్టం చేశారు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలంలోని కుతుకులూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం, అనపర్తిలో బీటీరోడ్డును ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డితో -మిగతా 2లో



## విదేశీ విద్యార్థులు రావడం అమెరికాలోని వ్యాపారాలకు మంచిది: డొనాల్డ్ ట్రంప్

**అమెరికాలో చదువుకోవడానికి ఎలాంటి అడ్డంకులు లేవన్న ట్రంప్**

**విదేశీ విద్యార్థులను సగానికి తగ్గిస్తే వ్యవస్థ దెబ్బతింటుందని ఆందోళన**

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,నవంబర్ 11)

విదేశీ విద్యార్థులు అమెరికాలో విద్యనభ్యసించడానికి రావడం తమ దేశంలోని వ్యాపారాలకు మేలు చేస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఇతర దేశాల విద్యార్థులు అమెరికాలో చదువుకునేందుకు ఎలాంటి ఆటంకాలు లేవని ఆయన స్పష్టం చేశారు. ఇది దేశంలోని ఉన్నత విద్యా వ్యవస్థకు ప్రోత్సాహకరంగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల నుంచి అమెరికాకు వస్తోన్న విద్యార్థుల సంఖ్యను సగానికి తగ్గించాలనే ఆలోచనను ఆయన వ్యతిరేకించారు. అలా చేస్తే అమెరికాలోని విశ్వవిద్యాలయాలు, కళాశాలల వ్యవస్థ తీవ్రంగా నష్టపోతుందని, అది జరగకుండా చూస్తానని ఆయన అన్నారు. ఇతర దేశాల విద్యార్థులు రావడం మంచి పరిణామమని ఆయన అభివర్ణించారు. తాను ప్రపంచంతో కలిసి ఉండాలని కోరుకుంటున్నానని ట్రంప్ అన్నారు. అమెరికాకు వచ్చేవారి -మిగతా 2లో



## ఇకపై ఏపీ ప్రజలకూ నేను మామనే కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్


(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 11)

ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కలయిక అద్భుతమని కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అన్నారు. ఆ ముగ్గురూ కలిసి రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తున్నారని చెప్పారు. గుంటూరు జిల్లా వెంగళాయపాలెం చెరువు వద్ద వాటర్‌షెడ్ పథకం కింద రూ.1.20కోట్లతో చేపట్టిన పనులను కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలతో కలిసి ఆయన పరిశీలించారు. తొలుత శివరాజ్‌సింగ్‌తో కలిసి పెమ్మసాని చంద్రశేఖర్, కందుల దుర్గేష్ పూజలు చేశారు. అనంతరం పైలాన్‌ను కేంద్రమంత్రులు ఆవిష్కరించారు. ఆ తర్వాత అక్కడ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా శివరాజ్‌సింగ్ మాట్లాడారు. "వెంగళాయపాలెం చెరువు పునరుద్ధరణ చూశాక నాకు చాలా సంతోషం వేసింది. పురాతన చెరువును అత్యాధునికంగా తీర్చిదిద్దారు. దీని ద్వారా ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు పెరుగుతాయి. పశువులకు తాగునీరు లభిస్తుంది. మత్స్య సంపద -మిగతా 2లో



## నాయుడుపేటలో దేశంలోనే అతి పెద్ద పీసీబీ తయారీ యూనిట్ వస్తోంది

- ఏపీకి మరో భారీ పెట్టుబడి
- నాయుడుపేటలో సిర్మా ఎస్‌జీఎస్ ప్లాంట్
- రూ.1,595 కోట్ల పెట్టుబడితో పీసీబీ తయారీ యూనిట్
- సుమారు 2,170 మంది యువతకు నైపుణ్యంతో కూడిన ఉపాధి
- తమ ప్రభుత్వ 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' వల్లే సాధ్యమైందన్న లోకేశ్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 11)

ఆంధ్రప్రదేశ్‌కు మరో భారీ పెట్టుబడి తరలివస్తోంది. దేశంలోనే అతిపెద్ద మల్టీ-లేయర్ ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్ (పీసీబీ) తయారీ యూనిట్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు ప్రముఖ ఎలక్ట్రానిక్స్ సంస్థ సిర్మా ఎస్‌జీఎస్ టెక్నాలజీస్ ముందుకొచ్చింది. తిరుపతి జిల్లా నాయుడుపేట సమీపంలో రూ.1,595 కోట్ల పెట్టుబడితో ఈ ప్లాంట్‌ను నెలకొల్పనున్నట్లు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ -మిగతా 2లో

## ఢిల్లీలో భారీ పేలుడు.. అమిత్ షా హైలెవల్ మీటింగ్

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,నవంబర్ 11)

భారీ పేలుడుతో దేశ రాజధాని నగరం ఢిల్లీ ఉలిక్కిపడింది. ఈ నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన ఉన్నతస్థాయి భద్రతా సమావేశం జరుగుతోంది. మంగళవారం కర్తవ్యభవన్‌లో జరుగుతోన్న ఈ భేటీలో హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్, ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ తపన్ కుమార్, ఢిల్లీ పోలీస్ కమిషనర్ సతీష్ గోల్చా, జాతీయ దర్యాప్తు సంస్థ డైరెక్టర్ జనరల్ సదానంద్ వసంత్ పాల్గొన్నారు. జమ్మూకశ్మీర్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ నళిన్ ప్రభాత్ వర్చువల్‌గా హాజరయ్యారు. ఢిల్లీ పేలుడు, ఉగ్ర కుట్రలు, కశ్మీర్ ఘటనలపై చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అమిత్ షా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అలాగే ఎల్ఎన్‌జేపీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నవారిని పరామర్శించారు. ఢిల్లీ పోలీస్ చీఫ్, డైరెక్టర్ ఆఫ్ ఇంటెలిజెన్స్ బ్యూరోతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు.నిత్యం రద్దీగా ఉండే చారిత్రక ఎర్రకోటకు అతి సమీపంలో సోమవారం సాయంత్రం ఓ కారులో భారీ పేలుడు సంభవించింది . దాని ధాటికి అనేక వాహనాలు బుగ్గిఅయ్యాయి. 9 నిండు ప్రాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. మరో 20 మంది గాయాలపాలయ్యారు. వీరిలో ముగ్గురి పరిస్థితి అత్యంత విషమంగా ఉంది. ఈ ఘటనతో దేశమంతటా రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఈ పేలుడు దృష్ట్యా ఎర్రకోట మెట్రోస్టేషన్‌ను మూసివేశారు. భద్రతా కారణాలతో దానిని మూసివేసినట్లు చెప్పారు.



## ప్రజల ఆస్తి వివాదాల్లో తలదూరుస్తున్న ఎమ్మెల్యేలు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 11)

కొందరు ఎమ్మెల్యేలు ప్రజల వ్యక్తిగత, ఆస్తి వివాదాల్లో తలదూరుస్తున్నారని, బెదిరిస్తున్నారని, తప్పులు చేస్తున్నారని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోమవారం మంత్రివర్గ సమావేశంలో ప్రస్తావించారు. ఏదైనా వివాదంలో ఇరుపక్షాలు రాజీకి సిద్ధమైనా.. -మిగతా 2లో

# ఆలోచనతో రండి..
# పారిశ్రామికవేత్తలు కండి

పార్కును మంగళవారం ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా మరో 17 జిల్లాల్లో రూ.873 కోట్ల వ్యయంతో 868 ఎకరాల్లో అభివృద్ధి చేసిన 49 ఎంఎస్ఎంఈ పార్కులకు వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. వీటితో పాటు రూ.25,256 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటైన 38 మెగా పారిశ్రామిక యూనిట్లను కూడా సీఎం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమం అనంతరం పలు జిల్లాల పారిశ్రామికవేత్తలతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు.

### పెట్టుబడులకు ఏపీ స్వర్గధామం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువలా వస్తున్నాయని చంద్రబాబు అన్నారు. "ఈ రోజు 99 కంపెనీలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసుకుంటున్నాం. వీటి ద్వారా రూ.2.65 లక్షల కోట్ల పెట్టుబడులతో 2 లక్షల మందికి ఉపాధి లభిస్తుంది. జనవరి నాటికి మరో 70 ఎంఎస్ఎంఈ పార్కులను ప్రారంభిస్తాం. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే మా లక్ష్యం" అని సీఎం వివరించారు.

టెక్నాలజీ భవిష్యత్తును శాసిస్తుందని, అందుకే అమరావతిలో జనవరికి క్వాంటం కంప్యూటింగ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. సౌర విద్యుత్, గ్రీన్ హైడ్రోజన్, బయో ఫ్యూయెల్ ప్లాంట్ల ఏర్పాటుతో ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధిస్తామన్నారు. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ, త్వరలోనే సెమీ కండక్టర్ పరిశ్రమ ఏర్పాటు కానున్నట్లు వెల్లడించారు. ఈ నెల 14, 15 తేదీల్లో జరిగే సీఐఐ భాగస్వామ్య సదస్సులో రూ.10 లక్షల కోట్ల విలువైన ఒప్పందాలు కుదుర్చుకోనున్నామని, తద్వారా 8 లక్షల ఉద్యోగాలు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

### గత పాలనపై తీవ్ర విమర్శలు

గత ప్రభుత్వ హయాంలో పారిశ్రామికవేత్తలు రాష్ట్రం విడిచి పారిపోయారని, పరిశ్రమలు మూతపడ్డాయని చంద్రబాబు విమర్శించారు. "గతంలో పారిశ్రామికవేత్తలు 'ఛలోఛలో' అంటూ రాష్ట్రం నుంచి వెళ్లిపోతే, ఇప్పుడు 'భలేభలే' అంటూ తిరిగి వస్తున్నారు. విశాఖకు గూగుల్ సంస్థ లక్ష కోట్ల పెట్టుబడితో వస్తోంది. ఇదే మా ప్రభుత్వంపై ఉన్న నమ్మకం" అని అన్నారు.

గత పాలకులు పీపీఏలు రద్దు చేసి, విద్యుత్ వాడకుండానే రూ.9 వేల కోట్లు చెల్లించారని, ఆ డబ్బు ఉండి ఉంటే ఎన్నో ప్రాజెక్టులు పూర్తయ్యేవని ఆవేదన వ్యక్తం చేశారు. ధ్వంసమైన ఏపీ బ్రాండ్‌ను పునరుద్ధరిస్తున్నామని, కేంద్ర ప్రభుత్వం ఏ పాలసీ తెచ్చినా దేశంలో మొదట అమలు చేసేది ఏపీనే అని స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పూర్తి సహకారం అందిస్తుండగా, మంత్రి లోకేశ్ పట్టువదలని విక్రమార్కుడిలా పనిచేస్తున్నారని ప్రశంసించారు.

### సంపద సృష్టి.. ప్రజల భాగస్వామ్యం

రాష్ట్రంలో సంపద సృష్టించి, అందులో ప్రజలందరినీ భాగస్వాములను చేస్తామని చంద్రబాబు పునరుద్ఘాటించారు. "ఆలోచనలే ఇప్పుడు ఆస్తి. లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. రైతులు కూడా ఎఫ్‌పీఓలు ఏర్పాటు చేసుకుని పారిశ్రామికవేత్తలుగా మారాలి," అని పిలుపునిచ్చారు. ఎంఎస్ఎంఈల ద్వారానే 5 లక్షల ఉద్యోగాలు కల్పించాలని నిర్ణయించామన్నారు. రామాయపట్నం పోర్టు సమీపంలో బీపీసీఎల్ సంస్థ లక్ష కోట్ల పెట్టుబడితో రిఫైనరీ ఏర్పాటు చేస్తోందని, పోర్టులను అభివృద్ధి చేసి రాష్ట్రాన్ని ఈస్ట్ కోస్ట్ లాజిస్టిక్స్ హబ్‌గా మారుస్తామని తెలిపారు. 15 శాతం వృద్ధి రేటు సాధించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

### వెనుకబడిన ప్రాంతాలకు పెద్దపీట

వెనుకబడిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి పరిశ్రమలు, సాగునీరు అందిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. "2026 నాటికి వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసి ప్రకాశం జిల్లాకు నీళ్లిస్తాం. కనిగిరి ఇకపై కనకపట్నం అవుతుంది. కరవు పీడిత ప్రాంతాలైన కనిగిరి, యర్రగొండపాలెం, గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గాలకు గోదావరి జలాలను కూడా

## మొదటి పేజీ తరువాయి

తీసుకొస్తాం. 2019లో మేం అధికారంలోకి రాకపోవడం వల్లే ఈ ప్రాజెక్టు ఆలస్యమైంది," అని అన్నారు. భవిష్యత్తులో ప్రజలకు ఇలాంటి కష్టాలు రాకుండా చూస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, ఏపీఐఐసీ చైర్మన్ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

# నాయుడుపేటలో దేశంలోనే అతి పెద్ద పీసీబీ తయారీ యూనిట్ వస్తోంది

మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ పరిశ్రమ ద్వారా 2,170 మంది యువతకు ఉన్నత నైపుణ్యం కలిగిన ఉద్యోగాలు లభిస్తాయని ఆయన తెలిపారు. ఈ పెట్టుబడి కేవలం ఒక పరిశ్రమ ఏర్పాటు మాత్రమే కాదని, రాష్ట్ర ప్రజల సామర్థ్యంపై ఉంచిన నమ్మకానికి నిదర్శనమని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాన్ని ఆచరణలో చూపిస్తున్నామని తెలిపారు. పరిశ్రమలు వేగంగా కార్యకలాపాలు ప్రారంభించేందుకు వీలుగా భూమి, నీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను ముందే సిద్ధం చేసి, తక్షణమే అందించే పరిష్కారాలను అందిస్తున్నామని వివరించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కంటే 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానమే ఏపీని ప్రత్యేకంగా నిలుపుతోందని మంత్రి అన్నారు. ఈ విషయాన్ని సిర్మా ఎస్‌జీఎస్ మేనేజింగ్ డైరెక్టర్ జేఎస్ గుజ్రాల్ మాటలు బలపరుస్తున్నాయని చెప్పారు. "మాకు వేగం అవసరం, అందుకే ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకున్నాం" అని గుజ్రాల్ అన్నట్లు లోకేశ్ ఉటంకించారు. నైపుణ్యం కలిగిన మానవ వనరుల లభ్యత, ఓడరేవులకు సమీపంలో ఉండటం వంటి అనుకూలతల వల్ల అత్యాధునిక తయారీ రంగ సంస్థలకు ఏపీ మొదటి ఎంపికగా మారిందని అభిప్రాయపడ్డారు. భారత్ ఏటా సుమారు 70 బిలియన్ డాలర్ల విలువైన ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటోందని, ఈ కొత్త ప్లాంట్ ఏర్పాటుతో ఆ దిగుమతుల భారాన్ని తగ్గించడంలో సహాయపడుతుందని లోకేశ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పెట్టుబడి రాష్ట్రంలో బలమైన ఎలక్ట్రానిక్స్ తయారీ పర్యావరణ వ్యవస్థను నిర్మిస్తుందని, ఇది రాష్ట్రానికి, ప్రజలకు గర్వకారణమైన మైలురాయి అని ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు.

# ప్రజల ఆస్తి వివాదాల్లో తలదూరుస్తున్న ఎమ్మెల్యేలు

ఎమ్మెల్యేలు వారిని రాజీ పడనివ్వడం లేదని పేర్కొన్నారు. ఒక ఎమ్మెల్యే వ్యవహారం తన దృష్టికి వస్తే, తీరుమారాలని హెచ్చరించానని చెప్పారు. కూటమిలోని ఏ పార్టీ ఎమ్మెల్యేలు తప్పుచేసినా కఠినంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును ఆయన కోరారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ఇన్‌ఛార్జి మంత్రులు చొరవ తీసుకోవాలని ముఖ్యమంత్రి చెప్పినప్పుడు.. పవన్ కల్యాణ్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. ఎమ్మెల్యేలు తప్పులు చేస్తే ఉపేక్షించవద్దని కలెక్టర్లు, ఎస్పీలకు ఆదేశాలు జారీచేయాలని ఆయన సూచించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి అధికారులూ చొరవ తీసుకోవట్లేదని, తనకు వస్తున్న అర్జీల్లోనూ 60-70% అవేనని తెలిపారు. ప్రజల ఆస్తుల వ్యవహారాల్లో ప్రభుత్వం స్పందించకపోతే చులకనవుతామని పవన్ పేర్కొన్నారు. దానిపై సీఎం స్పందిస్తూ... ఎమ్మెల్యేలు తప్పులు చేస్తే వారిని గాడిలో పెట్టాల్సిన బాధ్యత ఇన్‌ఛార్జి మంత్రులదేనని తెలిపారు. "ఎమ్మెల్యేల పనితీరు మారాలి. లేకపోతే గత ఎన్నికల్లో 50 వేలకుపైగా మెజార్టీలు వచ్చిన వారికి వచ్చే ఎన్నికల్లో 10వేల మెజార్టీ కూడా రాకపోవచ్చు" అని సీఎం వ్యాఖ్యానించారు. ఇన్‌ఛార్జి మంత్రులు చొరవ తీసుకుని రెవెన్యూ సమస్యల్ని పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అనంతపురం జిల్లాలో కలెక్టర్, జేసీ, ఆర్డీవో, తహసీల్దారులంతా కూర్చుని, ఒకేసారి 400 సమస్యల్ని పరిష్కరించారని ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ చెప్పడంతో అలాంటి మంచి అలవాట్లను అనుసరించేలా రాష్ట్రమంతా ఆదేశాలు జారీచేద్దామని సీసీఎల్ఏకు సీఎం సూచించారు.

# హిందువుల విశ్వాసాలతో ఆడుకోవద్దు: పవన్ కల్యాణ్

చివరికి అపరిచితులతో కూడా మనం ఆ ప్రసాదాన్ని పంచుకుంటాం. ఎందుకంటే, అది మన సామూహిక విశ్వాసానికి, ప్రగాఢ భక్తికి ప్రతీక" అని వివరించారు. ఏటా సగటున 2.5 కోట్ల మంది భక్తులు తిరుమలను సందర్శిస్తారని గుర్తుచేశారు.

"సనాతనుల మనోభావాలను, ఆచారాలను ఎగతాళి చేసినప్పుడు లేదా కించపరిచినప్పుడు అది కేవలం బాధ కలిగించడమే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది భక్తుల నమ్మకాన్ని, విశ్వాసాన్ని దెబ్బతీస్తుంది. లౌకికవాదం అనేది రెండు వైపులా ఉండాలి. మా విశ్వాసానికి రక్షణ, గౌరవం ఇవ్వడంలో రాజీ పడకూడదు" అని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. మన సనాతన ధర్మం అత్యంత పురాతనమైన, నిరంతరం అభివృద్ధి చెందుతున్న నాగరికత అని పేర్కొన్న పవన్, భాగస్వాములందరి ఏకాభిప్రాయంతో 'సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు'ను స్థాపించడానికి ఇదే సరైన సమయమని ఆయన అభిప్రాయపడ్డారు. అంతకుముందు, నటుడు ప్రకాశ్ రాజ్ సోషల్ మీడియాలో తిరుపతి లడ్డూ అంశంపై తనదైన శైలిలో స్పందించారు. "పాలు లేని కల్తీ నెయ్యిలో మతోన్మాదాన్ని కలపకుండా, కల్తీ రాజకీయం చేయకుండా ఇప్పటికైనా తప్పు చేసిన వాడిని శిక్షించే పని చూడండి" అంటూ ట్వీట్ చేశారు.

# రాజ్యాంగ నిపుణులతో చర్చించా.. వైకాపాకు ప్రతిపక్ష హోదా కుదరదు

కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. "జగన్ బయట మైకులు పట్టుకుని మాట్లాడడం కాదు. అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలి. ఆయనకు అక్కడ తగినంత సమయం ఇస్తాం. వైకాపా హయాంలో నన్ను అరెస్టు చేయించారు. ఆ కారణంగా అసెంబ్లీలో అధ్యక్షా అని నన్ను సంబోధించడానికి నోరురాక జగన్ వెనక్కి జంకుతున్నారు. అసెంబ్లీ ఓ దేవాలయం. అందులో నేను పూజారిని మాత్రమే" అని తెలిపారు. వయసు రీత్యా వచ్చే ఎన్నికల్లో పోటీకి తాను విరమించుకుంటున్నట్లు అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు.

# విదేశీ విద్యార్థులు రావడం అమెరికాలోని వ్యాపారాలకు మంచిది: డొనాల్డ్ ట్రంప్

సంఖ్యను సగానికి తగ్గిస్తే కొందరికి సంతోషం కలగవచ్చు కానీ కళాశాలలకు మాత్రం వ్యాపారం తగ్గిపోతుందని ఆయన అన్నారు. దేశీయ విద్యార్థుల కంటే విదేశీ విద్యార్థులే అధికంగా ఫీజులు చెల్లిస్తున్నారని ట్రంప్ తెలిపారు. ఇదిలా ఉండగా, అమెరికాకు వచ్చే విద్యార్థులకు సోషల్ మీడియా వెట్టింగ్ (సోషల్ మీడియా ఖాతాల పరిశీలన)ను తప్పనిసరి చేస్తూ అమెరికా ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే.

# ఇకపై ఏపీ ప్రజలకూ నేను మామనే కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్

పెంచడానికి, బోటింగ్ సౌకర్యానికి చెరువును ఉపయోగించవచ్చు. వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, ఓపెన్ థియేటర్ వంటివి ప్రజలకు ఆనందాన్ని ఆరోగ్యాన్ని పంచుతాయి. తక్కువ ఖర్చుతో ఇన్ని సౌకర్యాలు కల్పించిన పెమ్మసాని చంద్రశేఖర్, బూర్ల రామాంజనేయులకు అభినందనలు. దిల్లీ పేలుళ్ల ఘటనలో మృతిచెందిన వారికి ఈ వేదిక నుంచి నివాళు లర్పిస్తున్నా. కేంద్రమంత్రి హోదా కంటే ప్రజలకు సేవ చేయడం కోసమే ఇక్కడికి వచ్చా. ప్రజా సేవ దైవ పూజగా భావిస్తా. మధ్యప్రదేశ్‌లో ప్రజలు నన్ను మామ అంటారు. ఇకపై ఏపీ వారికి కూడా నేను మామనే. దేశవ్యాప్తంగా ఇదే తరహాలో చెరువుల పునరుద్ధరణ చేస్తామని మాటిస్తున్నా" అని శివరాజ్‌సింగ్ చౌహాన్ అన్నారు.

# కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాయలసీమకు మొండి చెయ్యి


### రాయలసీమ అభివృద్ధికి నిధులు కేటాయించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వం
### రాయలసీమ అభివృద్ధి ధ్యేయంగా సిపిఐ ఎంఎల్ లిబరేషన్ 9వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి
### రాయలసీమ అభివృద్ధికి సిపిఐ ఎంఎల్ రాష్ట్ర మహాసభ వేదిక




**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, నవంబర్ 12)**

చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు రాష్ట్ర అభివృద్ధి, సంపద సృష్టి సంక్షేమం తెస్తామని చెప్పి రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజ్ ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన డబల్ ఇంజన్ సర్కార్ అభివృద్ధికి ఏమాత్రం అడుగులు వేయకపోవడం మరో మారు రాయలసీమ ద్రోహులుగా మిగిలిపోతున్నారని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా స్టాండింగ్ కమిటీ మెంబర్ ఎస్.చంద్రశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు కే. జకరయ్యలు అన్నారు. డిసెంబర్ 6, 7 తేదీలలో కడప నగరంలో జరుగుతున్న 9వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని అందుకు సంబంధించిన బుక్లెట్లను ఆ పార్టీ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ అన్నింటిని అమలు చేస్తామని చెప్పి సూపర్ సిక్స్ను గాలికి వదిలేసారని రాష్ట్ర అభివృద్ధి అంతా పోలవరం, అమరావతి చుట్టూ తప్ప రాయలసీమ జిల్లాలకు ఒరిగిందేమీ లేదని వారు ఎద్దేవా చేశారు. రాయలసీమలో పెండింగ్ ప్రాజెక్టులు పరిశ్రమలో కడప ఉక్కు ఫ్యాక్టరీ వంటి సమస్యలు పరిష్కరించకుండా 17 నెలలోనే రాష్ట్ర ఖజానాను అప్పుల ఖజానాగా మార్చారే తప్ప రాయలసీమకు వరగబెట్టిందేమీ లేదన్నారు. ఈ నేపథ్యంలో రాయలసీమ జిల్లాలో ఉన్నటువంటి సమస్యల పరిష్కారం కొరకు సిపిఐ ఎంఎల్ లిబరేషన్ 9వ రాష్ట్ర మహాసభలు వేదిక కాబోతున్నాయని ఆ రాష్ట్ర మహాసభలలో రాయలసీమ జిల్లాలో ఉన్నటువంటి సమస్యలపై చర్చించి భవిష్యత్తు పోరాటాలకు నాంది పలుకుతామని వారన్నారు. ముఖ్యంగా కడప జిల్లాలో పారిశ్రామిక రంగం రియల్ ఎస్టేట్ వ్యాపారం వంటి పూర్తిగా వెనుకబడిపోయాయని ఇందుకు కారణం అమరావతి పోలవరం చుట్టూ తిరుగుతూ కోట్లాది రూపాయలు రాష్ట్ర ఖ జనాన్ని ఆ రెండు ప్రాంతాలకు ఖర్చు పెట్టడంతో రాయలసీమ ప్రాంతానికి ఏ ఒక్క రూపాయి నిధులు కేటాయించకపోవడంతో ఈ ప్రాంతంలో నిరుద్యోగ సమస్య పెరిగిపోతుందని వారన్నారు. సూపర్ సిక్స్ లో ఉన్నటువంటి నిరుద్యోగ భృతి అమలు చేయకపోవడం 18 సంవత్సరాలు నిండినటువంటి ప్రతి మహిళకు నెలకు రూ.1500 చొప్పున ఇస్తామని చెప్పినటువంటి పథకం అమలు చేయకపోవడంతో సూపర్ సిక్స్ లో ఉన్న హామీలను ఏ మేరకు అమలు చేశారో అర్థమవుతుందని వారన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం చంద్రబాబు కూటమి ప్రభుత్వం సంపదలను కార్పొరేట్ సంస్థలకు ఇచ్చే కార్యక్రమంలో ఉన్నారని వారన్నారు. సూపర్ సిక్స్ సూపర్ ఫ్లాప్ గా మిగిలిపోయాయి తప్ప ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదని వారు ఎద్దేవా చేశారు. మొంథా తుఫాన్ తో నష్టపోయిన కడప రాయలసీమ ప్రాంత రైతాంగానికి ఇన్సూరెన్స్ రూపంలో గానీ నష్టపరిహారం గాని ఒక్క రూపాయి ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. తక్షణమే పంట నష్టపరిహారం చెల్లించి ఇప్పుడు పెట్టబోయే పంటలకు ఎరువులు, మందులు, విత్తనాలు వంటివి ప్రభుత్వమే ఆర్బికల్ ద్వారా ఉచితంగా ఇవ్వాలని ప్రతి రైతుకు బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణాలను లక్ష రూపాయల వరకు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో వెనుకబడిన రాయలసీమ ప్రాంతమైన కడప నగరంలో డిసెంబర్ 6వ తేదీన జరిగే ర్యాలీ బహిరంగ సభలో వందలాది మంది ఈ నియోజకవర్గ ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఈ మహాసభలకు జాతీయ కార్యదర్శి మరియు పార్లమెంటు సభ్యులు హాజరవుతున్నారని, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని తమ సమస్యల పరిష్కారం కోసం హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏరియా కమిటీ సభ్యులు రామరాజు, కే బాబు, ఎం విజయరావు, సి నారాయణ, ఐ శివరాం, నాయకులు సుబ్బయ్య, చెన్నయ్య, గురప్ప, జాన్ రమణయ్య, పోలయ్య, మహబూబ్ బాషా, శ్యామ్సన్, చిట్టిబాబు, జేమ్స్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాణస్వీకార మహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయ్ కుమార్



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 11)**

ఒంగోలులో మంగమూరు రోడ్డు మర్రిచెట్టు దగ్గర సంతనూతలపాడు ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం మండల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శిలు, నియోజకవర్గ అనుబంధ కమిటీల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శిల ప్రమాణస్వీకార మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సంతనూతలపాడు నియోజకవర్గ శాసనసభ్యులు బిఎన్ విజయ్ కుమార్ ముందుగా పార్టీ జెండా ఆవిష్కరణ చేసి అనంతరం కేక్ కటింగ్ చేసిన అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో ప్రమాణస్వీకారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, మండల అధ్యక్షులు ఉప్పుగుండూరు నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, పోతినేని శ్రీనివాసరావు, అడక స్వాములు, మల్లవరం వెంకటేశ్వరస్వామి టెంపుల్ చైర్మన్ రాఘవ, నియోజకవర్గ నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ అనుబంధ కమిటీల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.









# ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన ఎమ్మెల్యే ఇంటూరి




**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, నవంబర్ 11)**

కనిగిరి నియోజకవర్గం పీసీపల్లి మండలం లింగన్నపాలెంలో ఎంఎస్ఎంఈ పార్క్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విచ్చేశారు. ఈ సందర్భంగా కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు, ముఖ్యమంత్రి ని కలిసి స్వాగతం పలికారు.

రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న ఎంఎస్ఎంఈ పార్కుల ద్వారా నిరుద్యోగ యువతకు ఎంతో మేలు జరుగుతుందని, తద్వారా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే నాగేశ్వరరావు పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేస్తున్నారని, త్వరలో కందుకూరు నియోజకవర్గంలో కూడా ఇలాంటి పార్కు ఏర్పాటు కాబోతుందని ఎమ్మెల్యే తెలిపారు.

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు   తెలుగు దినపత్రిక
ప్రకాశం

# కేంద్రం ఏ పాలసీ తెచ్చినా మొదట అమలు చేసేది ఏపీనే



- పెట్టుబడులకు అనువుగా 175 నియోజకవర్గాల్లో
- ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కులు
- ఎంఎస్ఎంఈల ద్వారా 5 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం
- సీఐఐ భాగస్వామ్య సదస్సులో రూ.10 లక్షల కోట్ల ఎంఓయూలు
- కేంద్రం ఏ పాలసీ తెచ్చినా మొదట అమలు చేసేది ఏపీనే
- 2026 నాటికి వెలుగొండ పూర్తిచేసి ప్రకాశం జిల్లాకు నీళ్లిస్తాం
- కనిగిరి ఎంఎస్ఎంఈ పార్కు ప్రారంభ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- 17 జిల్లాల్లో వర్చువల్‌గా పారిశ్రామిక పార్కుల ప్రారంభించిన సీఎం



(షణ్ముఖ వెలుగు, కనిగిరి, నవంబర్ 11)

కేంద్రం ఏ పాలసీతెచ్చినా మొదట అమలు చేసేది ఏపీనే అని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువలా వస్తున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. యువత ఆలోచనలతో ముందుకు వస్తే పారిశ్రామిక యూనిట్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చేయూత ఇస్తుందని ప్రకటించారు. దీని కోసం రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లోనూ ప్లగ్ అండ్ ప్లే విధానంలో పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. విద్యుత్తు, నీటి సరఫరా, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలను ఈ పార్కుల్లో కల్పిస్తూ పెట్టుబడులకు అనువుగా ఉండేలా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గం పెదఈర్లపాడులో ఎంఎస్ఎంఈ పార్కును ముఖ్యమంత్రి ప్రారంభించారు. దీంతో పాటు 17 జిల్లాల్లో ఏర్పాటు చేసిన మరో 49 ఎంఎస్ఎంఈ పార్కులకు వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. 868 ఎకరాల విస్తీర్ణంలో రూ.873 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టులను పరిశ్రమల శాఖ చేపట్టింది. పారిశ్రామిక పార్కుల్లో భూమి పొందిన 1597 ఎంఎస్ఎంఈ సంస్థలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు సీఎం చేశారు. వీటితో పాటు రాష్ట్రంలో రూ.25,256 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటైన 38 వివిధ మెగా పారిశ్రామిక యూనిట్లను కూడా ముఖ్యమంత్రి వర్చువల్ గా ప్రారంభించారు. అనంతరం శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, కర్నూలు, అనంతపురం, చిత్తూరు తదితర జిల్లాల్లోని పారిశ్రామిక పార్కుల్లో ఏర్పాటు చేసిన పారిశ్రామిక వేత్తలతోనూ సీఎం వీడియో కాన్ఫరెన్సు ద్వారా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

### సీఐఐ భాగస్వామ్య సదస్సులో రూ.10 లక్షల కోట్ల ఎంఓయూలు

పరిశ్రమలకు అనువైన వాతావరణం, పాలసీలు రాష్ట్రంలో ఉన్నాయి. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులకు ప్రభుత్వం తగిన చేయూత అందిస్తుందని సీఎం అన్నారు. ఈ అంశంపై మాట్లాడుతూ "నేడు 99 కంపెనీల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసుకుంటున్నాం. వీటి ద్వారా రూ.2.65 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చి 2 లక్షల మందికి పైగా యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు వస్తాయి. జనవరికి మరో 70 ఎంఎస్ఎంఈ పార్కులను ప్రారంభిస్తాం.175 నియోజకవర్గాల్లోనూ పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేసి ప్రతీ కుటుంబంలోనూ ఒక ఔత్సాహిక పారిశ్రామిక వేత్తను తయారుచేస్తాం. భవిష్యత్ అంతా టెక్నాలజీదే. క్వాంటం కంప్యూటింగ్ జనవరికి అమరావతిలో ప్రారంభం అవుతుంది. ప్రపంచానికి క్వాంటం కంప్యూటర్లను మన రాష్ట్రం నుంచి ఉత్పత్తి చేసి పంపించేలా పరిస్థితి మారుతుంది. సౌర విద్యుత్ ఉత్పత్తిని ఇంటి నుంచే తయారు చేసుకునేలా ప్యానెల్స్ ఏర్పాటు చేస్తున్నాం. రిలయన్స్ బయో ఫ్యూయెల్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తోంది. తక్కువ వ్యయంతో విద్యుత్ ఉత్పత్తి చేసేలా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేస్తున్నాం. డ్రోన్ సిటీని ఓర్వకల్లులో ఏర్పాటు చేస్తున్నాం. సివిలియన్, డిఫెన్స్ అప్లికేషన్ల కోసం డ్రోన్లను ఇక్కడే తయారు చేస్తాం. రాష్ట్రానికి సెమీ కండక్టర్ పరిశ్రమ కూడా త్వరలోనే ఏర్పాటు అవుతోంది. 14,15వ తేదీల్లో జరిగే సీఐఐ భాగస్వామ్య సదస్సులో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంఓయూలు చేసుకోబోతున్నాం. ఈ ఒప్పందాల ద్వారా 8 లక్షలకు పైగా ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

### గత ప్రభుత్వంలో పరిశ్రమలు మూతపడ్డాయి

గత పాలనలో పరిశ్రమలు మూతపడ్డాయని, పారిశ్రామికవేత్తలు రాష్ట్రం నుంచి పారిపోయారని ముఖ్యమంత్రి అన్నారు. ఈ అంశంపై సీఎం మాట్లాడుతూ చెత్త నుంచి సంపద సృష్టించడమే ఇప్పుడు కొత్త విధానం. కొత్తగా ఏర్పాటు అవుతున్న కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లు దీనిని అందిపుచ్చుకోవటం సంతోషదాయకం. దీనిద్వారా రాష్ట్రంలోని రైతులకు ప్రయోజనం కలుగుతుంది. పారిశ్రామిక పార్కుల్లో విద్యుత్, నీళ్లు, రహదారులు వంటి సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నాం. ఉద్యోగాలు ఇవ్వటం కాదు, పారిశ్రామికవేత్తగా చేస్తామని చెప్పి ఇప్పుడు దానిని నిరూపిస్తున్నామన్నారు. సమస్యల సుడిగుండంలో ఉన్న రాష్ట్రంలో 17 నెలల క్రితం పాలనా పగ్గాలు చేపట్టాం. ధ్వంసమైన ఏపీ బ్రాండ్‌ను పునరుద్ధరిస్తున్నామని సీఎం వివరించారు. గత పాలకులు పీపీఏలు రద్దు చేశారు. కరెంటు వాడుకోకుండానే రూ.9 వేల కోట్ల ప్రజాధనం చెల్లించారు. ఆ నిధులు వృధా కాకుండా ఉండి ఉంటే రాష్ట్రంలో అనేక ప్రాజెక్టులు కట్టుకునే వాళ్లం. అన్ని విధాలుగా గత పాలకులు రాష్ట్రాన్ని (తరువాయి 5లో...)



## ఆర్అండ్‌బి అధికారులకు షోకాజ్




(షణ్ముఖ వెలుగు, కనిగిరి, నవంబర్ 11)

ఆర్ అండ్ బి అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి షోకాజ్ నోటీసులు అందాయి. మంగళవారం ఎంఎస్ఎంఈ పార్క్ ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరయ్యారు. అయితే ముఖ్యమంత్రి రాకను పురస్కరించుకుని లింగన్నపాలెం వద్ద హెలిప్యాడ్ నిర్మాణం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంగళవారం హెలికాప్టర్‌లో రానుండడంతో సోమవారం హెలికాప్టర్ ద్వారా ట్రయల్ రన్ నిర్వహించారు. అయితే లింగన్నపాలెం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో నాణ్యతా ప్రమాణాలు లేకపోవడంతో పాటు హెలికాప్టర్ దిగుతున్న క్రమంలో పెద్ద ఎత్తున దుమ్ము లేయడంతో పాటు హెలిప్యాడ్ కుంగిపోతుందని పైలెట్ గుర్తించినట్లు సమాచారం. దాంతో సోమవారం సాయంత్రం లింగన్నపాలెం వచ్చిన హెలికాప్టర్ హెలిప్యాడ్ పై దిగకుండానే తిరిగి వెళ్ళిపోయింది. హెలిప్యాడ్ నిర్మాణ బాధ్యతలను చూడాల్సిన ఆర్ అండ్ బి ఎస్ఈ నాయక్, ఈఈ సమర్పియమ్ లకు రాష్ట్ర ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేయడం జరిగింది. హెలికాప్టర్ సోమవారం సాయంత్రం ట్రయల్‌రన్‌కు దిగి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగి ఉండేదని, ఆర్ అండ్ బి అధికారులందరి పై సస్పెన్షన్ వేటు పడి ఉండేదని ఆర్అండ్‌బి అధికారుల్లో చర్చ నడుస్తోంది. ఎస్ఈ, ఈఈ లపై కేవలం షోకాజ్ నోటీసులకే పరిమితమవుతుందా లేక వారి పై సస్పెన్షన్ వేటు పడుతుందా అనేది వేచి చూడాల్సిందే...!

## సీఎం సమక్షంలో టీడీపీలో చేరిన ఎంపిపి ప్రకాశం

### ముందే చెప్పిన షణ్ముఖ వెలుగు దిన పత్రిక



వెలుగు

టీడీపీ గూటికి కనిగిరి ఎంపిపి ?

మినీ మహానాడుకు హాజరు
అనుచరులతో మంతనాలు

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, మే 19)

కనిగిరి మండల పరిషత్ అధ్యక్షులు డి ప్రకాశం త్వరలో సైకిల్ ఎక్కనున్నారు. ఇప్పటికే ముఖ్య అనుచరులతో సమావేశాలు నిర్వహించినట్లు సమాచారం. ఇటీవల స్థానిక అమరావతి గ్రౌండ్‌లో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ప్రజాదర్బార్ నిర్వహించారు. ఆ సందర్భంగా ఎంపిపి ప్రకాశం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రను ప్రశంసలతో ముంచెత్తారు. ఎమ్మెల్యే అంటే ఉగ్రనే అంటూ ఉపన్యాసం దంచారు. దీంతో టీడీపీ కార్యకర్తలు, అర్జీదారులు చప్పట్లు చరిచారు. సోమవారం కనిగిరిలో జరిగిన మినీ మహానాడులో కూడా కనిగిరి ఎంపిపి డి ప్రకాశం కనిపించారు. టిడిపి నాయకులతో కరచాలనం చేస్తూ వారిలో ఉత్సాహాన్ని నింపారు. మహానాడులో కాని లేక ఆ తర్వాత గాని టీడీపీ తీర్థం పుచ్చుకోవడం ఖాయమని ఆయన ముఖ్య అనుచరులు షణ్ముఖ వెలుగు ప్రతినిధికి తెలిపారు. ఎంపిపి డి ప్రకాశం రెండు సార్లు కనిగిరి ఎంపిపిగా, ఒక సారి జడ్పీటిసిగా ఎన్నికయ్యారు. కనిగిరి నియోజకవర్గంలో బలమైన దళిత నేతగా ఆయన గుర్తింపు తెచ్చుకున్నారు. గత వైసీపీ పాలనలో అప్పటి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. అయితే కనిగిరి అభ్యర్థి మారడం, ఎంపి అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఇతర నాయకులు ఒత్తిడి తేవడంతో ఎంపిపి ఎన్నికల సమయంలో వైసీపీలోనే కొనసాగారు. కానీ నియోజకవర్గంలో వైసీపీ తరుపున ప్రచారం చేస్తూనే టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్ర ఎమ్మెల్యే అయినట్లేనని టీడీపీ నాయకులు, ఆయన ముఖ్య అనుచరులతో బహిరంగంగా చర్చించడం అప్పట్లో జరిగింది. వైసీపీ పై ఆయనకు అభిమానం ఉన్నా సరైన నాయకత్వం లేదనే తీవ్ర అసంతృప్తితో కొన్ని నెలలుగా రగిలిపోతున్నారు. 2009లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా డాక్టర్ ఉగ్ర గెలిచినప్పుడు ఆయన గెలుపు కోసం అప్పట్లో అహర్నిశలు పని చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర, ఎంపిపి ప్రకాశంలు ఇద్దరూ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు కావడంతో వారిద్దరి మధ్య రాజకీయ సంబంధాలే ఎక్కువగా ఉన్నాయి. కనిగిరి మాజీ ఎంపిపి పోతు కొండారెడ్డి ఎన్నికల సమయంలోనే టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్ర గెలుపు కోసం తీవ్రంగా కృషి చేశారు. ఆయన ప్రస్తుతం ఎమ్మెల్యేతోనే కొనసాగుతున్నారు. ప్రకాశం, పోతు కొండారెడ్డిలు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ కి పని చేస్తే వైసీపీకి కష్టకాలమనే చర్చ కనిగిరిలో సాగుతోంది. ఎంపిపి ప్రకాశం, రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో పార్టీలో చేరేందుకు సుముఖత చూపుతున్నట్లు తెలుస్తోంది. ఎంపిపి ప్రకాశం టీడీపీలో చేరితే చాకిరాల, ఎస్ గొల్లపల్లి పంచాయతీలు టీడీపీ కంచుకోట కానున్నాయి. కనిగిరి నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రకాశం ప్రభావం స్పష్టం కనిపించే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

www.shanmukhavelugu.com
20 May 2025 - Page 3

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, నవంబర్ 11)

కనిగిరి మండల పరిషత్ అధ్యక్షులు డి ప్రకాశం మంగళవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు.



మంగళవారం ఎంఎస్ఎంఈ పార్క్ ప్రారంభోత్సవానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా పార్టీ కండువా కప్పించుకుని అధికారికంగా టీడీపీలో చేరారు. వైసీపీ ఎంపిపి డి ప్రకాశం గత మే లో కనిగిరిలో జరిగిన మినీ మహానాడులో కూడా టిడిపి నాయకులతో చెట్టపట్టాల్ వేసుకుని తిరిగారు. ఆ రోజే టిడిపి గూటికి కనిగిరి ఎంపిపి అనే కథనం షణ్ముఖ వెలుగు దినపత్రికలో ప్రచురితమైంది. ఆ తరువాత టిడిపిలో చేరేందుకు పలు పర్యాయాలు ఎంపిపి ప్రయత్నించారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్నట్లు ఎంపిపి అనుచరులు చెప్పారు. కానీ మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో టిడిపి కండువా కప్పుకున్నారు. దీంతో కనిగిరి ఎంపిపి టీడీపీలో చేరడం అధికారికంగా జరిగిపోయింది.

## మొంథా తుఫాను బాధితులకు అండగా
## రూ.5.30 లక్షల చెక్కు సిఎం చంద్రబాబునాయుడుకు అందజేత





(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, నవంబర్ 11)

కనిగిరి నియోజకవర్గంలోని లింగన్నపాలెం గ్రామంలో ఎంఎస్ఎంఈ పార్క్ ప్రారంభోత్సవంలో భాగంగా మంగళవారం కనిగిరి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, పిడిసిసి బ్యాంకు ఛైర్మన్ కామేపల్లి సీతారామయ్యలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం వారు మొంథా తుఫాన్ వరద సహాయం కింద పీడీసీసీ బ్యాంక్ సిబ్బంది ఒక రోజు వేతనం రూ.5,30,000ల చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అందజేశారు. (తరువాయి 4లో...)



# మొంథా తుఫాను బాధితులకు అండగా రూ.5.30 లక్షల చెక్కు సిఎం చంద్రబాబునాయుడుకు అందజేత

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, నవంబర్ 11)

కనిగిరి నియోజకవర్గంలోని లింగన్నపాలెం గ్రామంలో ఎంఎస్ఎంఈ పార్క్ ప్రారంభోత్సవంలో భాగంగా మంగళవారం కనిగిరి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, పిడిసిసి బ్యాంకు ఛైర్మన్ కామేపల్లి సీతారామయ్యలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం వారు మొంథా తుఫాన్ వరద సహాయం కింద పీడీసీసీ బ్యాంక్ సిబ్బంది ఒక రోజు వేతనం రూ. 5,30,000ల చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అందజేశారు.








































# కేంద్రం ఏ పాలసీ తెచ్చినా మొదట అమలు చేసేది ఏపీనే

విధ్వంసం చేశారు. గత ప్రభుత్వంలో ఛలోఛలో అని పారిశ్రామిక వేత్తలు రాష్ట్రం నుంచి వెళ్లిపోతే ఇప్పుడు భలేభలే అంటూ రాష్ట్రానికి వస్తున్నారు. విశాఖకు లక్ష కోట్ల పెట్టుబడితో గూగుల్ కంపెనీ వస్తోంది. ఇదీ కూటమి ప్రభుత్వంపై కంపెనీలకు ఉన్న విశ్వాసం. కేంద్రం ఏ పాలసీ తీసుకొచ్చినా దాన్ని మొదట అమలు చేస్తోంది ఏపీనే. ప్రధాని మోదీ ఏది మొదలు పెట్టినా ఏపీలో తక్షణం అమలు చేస్తున్నాం. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రభుత్వానికి పూర్తి సహకారం ఇస్తున్నారు. పట్టు వదలని విక్రమార్కుడిలా మంత్రి లోకేష్ పనిచేస్తూ సాధించి తీసుకువస్తున్నారు. అని సీఎం స్పష్టం చేశారు.

**సంపద సృష్టిలో ప్రజల భాగస్వామ్యం....**

రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను తయారు చేస్తాం. లక్ష మంది మహిళా పారిశ్రామిక వేత్తల్ని తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆలోచనలే ఇప్పుడు ఆస్తి, రైతులు ఎఫ్‌పీఓలు పెట్టుకుని పారిశ్రామికవేత్తలుగా మారండి. హార్టికల్చర్, ఆక్వా కల్చర్, సేవల రంగంతో పాటు అన్ని రంగాల్లోనూ రాష్ట్రం ముందుకు వెళ్లాలి. ఎంఎస్ఎంఈల ద్వారానే 5 లక్షల ఉద్యోగాలు కల్పించాలని నిర్ణయించాం.

రాష్ట్రంలో ఉన్న వనరుల్ని సద్వినియోగం చేసుకునేలా అన్ని ప్రాంతాలనూ అభివృద్ధి చేస్తున్నాం. కర్నూలు తిరుపతి సహా మరికొన్ని ప్రాంతాలతో మరో రీజియన్‌గా అభివృద్ధి చేస్తాం. పోర్టులను అభివృద్ధి చేసి రాష్ట్రాన్ని ఈస్ట్ కోస్ట్ లాజిస్టిక్స్ హబ్ గా తయారు చేస్తాం. 15 శాతం వృద్ధి రేటు సాధించటం లక్ష్యంగా పెట్టుకున్నాం. రాష్ట్రంలో సగటు తలసరి ఆదాయం గణనీయంగా పెంచేలా పనిచేస్తున్నాం.

రామాయపట్నం పోర్టుకు దగ్గరే బీపీసీఎల్ లక్ష కోట్ల పెట్టుబడితో రిఫైనరీని ఏర్పాటు చేస్తోంది. రాష్ట్రంలో సంపద సృష్టిస్తాం.. అందులో ప్రజలందరినీ భాగస్వామ్యం చేస్తాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

**వచ్చే ఏడాది వెలుగొండ ద్వారా నీళ్లు...**

రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధపెట్టా. ఈ ప్రాంతాలకు పరిశ్రమలు, నీళ్లు తీసుకొస్తాం. అన్ని ప్రాంతాలకు పరిశ్రమలు, నీళ్లు విస్తరించాల్సి ఉంది. 2026లో వెలిగొండ పూర్తి చేసి నీళ్లిస్తాం. కనిగిరి ఇక కనకపట్నం అవుతుంది. కనిగిరి, యర్రగొండపాలెం, గిద్దలూరు, మార్కాపురం ప్రాంతాల్లో కరవు అధికంగా ఉంటుంది. ఈ నియోజకవర్గాలకు నీళ్లిస్తామని హామీ ఇచ్చాం.. దాన్ని త్వరలోనే నెరవేరుస్తాం. 2019లో అధికారంలోకి రాకపోవడం వల్ల ప్రాజెక్టు ఆలస్యమైపోయింది. శ్రీశైలం నుంచే కాదు గోదావరి నీళ్లు కూడా ఈ ప్రాంతానికి తెస్తాం. వైకుంఠపాళి వల్లే ప్రజల కష్టాలు తీరకుండా అలాగే ఉండిపోయాయి. భవిష్యత్తులో ఇది జరక్కూడదు అని ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, ఏపీఐఐసీ చైర్మన్ రామరాజు, జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు.

## విద్యార్థులలో జ్ఞాన జ్యోతిని వెలిగించడం అభినందనీయం

### శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తలను ప్రశంసించిన కుర్తాళం పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానంద భారతీ స్వామి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 11)

ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తలు చిన్మయ మిషన్ సహకారంతో విద్యార్థులకు సనాతన ధర్మం నైతిక విలువలు వంటి మంచి విషయాల పట్ల అవగాహన ఏర్పరచే ఉద్దేశంతో బాలవిహార్ శిక్షణా తరగతులను ప్రతి ఆదివారం శ్రీగిరి గోశాల భవనంలో నిర్వహిస్తూ విద్యార్థులలో నిజమైన జ్ఞాన జ్యోతిని వెలిగించడం అభినందనీయమని ఇందుకు మార్గ దర్శనం చేసిన శ్రీగిరి దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్త ఆలూరు వెంకట రమణారావు కృషి ప్రశంసనీయమని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానంద భారతీ స్వామి పేర్కొన్నారు. స్థానికంగా ఏర్పాటైన కార్యక్రమంలో పాల్గొనేందుకు ఒంగోలుకు వచ్చిన సిద్ధేశ్వరానంద భారతీ స్వామి వారిని శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీ కుమారి, వేద పండితులు శర్మ, తదితరులు కలిసి శ్రీగిరి దేవస్థానం పక్షాన చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. సనాతన ధర్మ పరిరక్షణ వంటి విషయాలలో శ్రీగిరి దేవస్థానానికి తమ వంతు తోడ్పాటును, సహకారాన్ని అంద చేస్తున్న డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ్ రాజీవ్, ఆలూరు జై శంకర్, తదితరులను సిద్ధేశ్వరానంద భారతీ స్వామి ప్రశంసించారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలికి స్వామీజీ తన ఆశీస్సులను అంద చేశారు.

## పటిష్ట బందోబస్తు నడుమ ప్రశాంతంగా ముగిసిన ముఖ్యమంత్రి పర్యటన

### జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు



(షణ్ముఖ వెలుగు, పీసీపల్లి, నవంబర్ 11)

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకాశం జిల్లాలోని పీసీ పల్లి మండలంలోని గుంటూరులింగన్నపాలెం గ్రామంలో మధ్య, చిన్న, సూక్ష్మతరహా పరిశ్రమల పార్కు ప్రారంభోత్సవానికి విచ్చేశారు. ఈ సందర్భంగా హెలిప్యాడ్ వద్ద ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. తదనంతరం, ఎంఎస్ఎంఈ పార్కును ప్రారంభించి, ఏర్పాటు చేసిన సభావేదికలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. అనంతరం విజయవంతంగా పర్యటనను ముగించి బయలుదేరారు. పర్యటనకు ముందు, హెలిప్యాడ్, విఐపి రూట్, సభా వేదిక, పార్కింగ్ ప్రాంతాలను జిల్లా ఎస్పీ సందర్శించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. వేదిక, హెలిప్యాడ్, ప్రధాన మార్గాల పై సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా ఉంచాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. బందోబస్తు విజయవంతంగా పూర్తి చేసినందుకు సభావేదిక, రూట్, ట్రాఫిక్ బాధ్యతలు నిర్వహించిన అధికారులు, బందోబస్తు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లతో పాటు ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా పూర్తైందని తెలిపారు.





## గవర్నమెంట్ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ పై వైస్సార్సీపీ నిరసన ర్యాలీ



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, నవంబర్ 11)

మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్చార్జి బుర్రా మధుసూదన యాదవ్ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి కందుకూరు అంబేద్కర్ విగ్రహం, ఓవీ రోడ్డు మీదుగా డాక్టర్ బాబు జగజ్జీవన్‌రావు విగ్రహం సెంటర్ నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమనికి నియోజకవర్గ రాష్ట్ర,జిల్లా, మండల, పట్టణ, గ్రామ అనుబంధ విభాగ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్పొరేటర్లు, వార్డు ఇంచార్జిలు, వివిధ అనుబంధ విభాగాల సభ్యులు, సోషల్ మీడియా సైనికులు, గ్రామ, వార్డు స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.



## గుండ్లాపల్లి పారిశ్రామిక వాడలో సూక్ష్మ, చిన్న తరహా, మధ్య తరహా పారిశ్రామిక పరిశ్రమల పార్కులు

### ప్రారంభించిన ఎమ్మెల్యే విజయకుమార్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 11)

మద్దిపాడు మండల పరిధిలోని గుండ్లాపల్లి పారిశ్రామిక వాడలో సూక్ష్మ, చిన్న తరహా, మధ్య తరహా పారిశ్రామిక పరిశ్రమల పార్కులు (ఎంఎస్ఎంఈ) అభివృద్ధి కార్యక్రమాలను సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్ మంగళవారం ప్రారంభించారు. గుండ్లాపల్లి పారిశ్రామికవాడలో సర్వేనెంబర్ 244లో రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో మూడు అంతస్తుల భవనంలో 30 షాపులను నిర్మించి ఔత్సాహికులైన పారిశ్రామికవేత్తలకు వీటిని లీజుకు ఇస్తామని తెలిపారు. దీనికి సంబంధించినటువంటి శిలాఫలకమును సంతనూతలపాడు శాసనసభ్యులు బి ఎన్ విజయ్ కుమార్ ఆవిష్కరించారు అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇండస్ట్రియల్ వస్తేనే యువతీ, యువకులకు ఉద్యోగాలు వస్తాయని అందులో భాగంగానే ఈరోజు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కనిగిరి నియోజకవర్గంలోని లింగన్నపాలెం గ్రామంలో ఎంఎస్ఎంఈ పార్కును ప్రారంభించడం జరిగిందన్నారు. కొన్ని నియోజకవర్గాల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారని నారా చంద్రబాబు నాయుడు ఒక విజినరీ ఉన్న నాయకుడు, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు బాగానే ముందుచూపుతో ఈ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ కమిషనర్ సత్యనారాయణ, జోనల్ మేనేజర్ మదన్మోహన్, ఆదిలక్ష్మి, రాష్ట్ర పొగాకు సమాఖ్య చైర్మన్ మండవ జయంత్ బాబు, మండల పార్టీ అధ్యక్షులు ఉప్పుగుండూరు నాగేశ్వరరావు, మండల సెక్రటరీ మందపల్లి శ్రీనివాసరావు, మద్దిపాడు మాజీ తెలుగు యువత అధ్యక్షులు పోతినేని శ్రీనివాసరావు, గట్టినేని అయన్న, ఆళ్ళ రవి, మండవ గోపి, దేవబత్తిన ప్రసాద్, పోకూరి శ్రీనివాసరావు, వడ్డింపూడి శ్రీనివాస్, దుగ్గినేని శ్రీనివాసరావు, నందిగం కోటయ్య, నరిపెద్ది అనిలా, అన్నాబత్తిన శివకృష్ణ, రామకృష్ణ , రవి, దాసరి రమేష్, ముప్పా రవి, తదితరులు పాల్గొన్నారు.








## మానేపల్లి గ్రామంలో సమిత్వ గ్రామ సభ



(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, నవంబర్ 11)

మానేపల్లి గ్రామ పంచాయతీలో మంగళవారం గ్రామ సచివాలయంలో సమిత్వ గ్రామ సభ ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.గ్రామ సభలో భాగంగా పంచాయతీ సిబ్బంది తయారు చేసిన సమిత్వ ఇంటి హక్కుల యాజమాన్య పత్రాలను గృహ యజమానులు పరిశీలించేందుకు ఉంచారు. యజమానుల ఇంటి హక్కులు, స్థల వివరాలు సరిగ్గా ఉన్నాయా అనే అంశంపై 9(2) నోటీసులను వారికి అందజేశారు. ఏవైనా లోపాలు లేదా పొరపాట్లు గమనించిన గృహ యజమానులు 10(2) నోటీసుల ద్వారా తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సమిత్వ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి వారి స్వంత గృహ హక్కు పత్రం అందేలా చర్యలు తీసుకుంటున్నామని, గ్రామ ప్రజల సహకారంతో పత్రాల తయారీని త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు.గ్రామస్థులు కూడా తమ హక్కు పత్రాలను పరిశీలించి సిబ్బందికి సహకరించారు. పంచాయతీ అధికారులు ఈ కార్యక్రమం ద్వారా అన్ని గృహ హక్కుల పత్రాలను సక్రమంగా సిద్ధం చేసి గృహ యజమానులకు అందజేయనున్నట్లు తెలిపారు.

## కుటుంబ సంక్షేమ పథకంలో చేరిన నూతన ఉపాధ్యాయులు



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, నవంబర్ 11)

గిద్దలూరులోని యుటిఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి మండలాధ్యక్షులు డాక్టర్ మొర్రి పిచ్చయ్య అధ్యక్షత వహించారు. నూతన ఉపాధ్యాయులకు సర్వీస్ రిజిస్టర్ల పంపిణీతో పాటు వీరికి శాలరీ చేయుటకు అవసరమైన యాక్ట్2 ఫామ్స్‌ను కూడ అందజేశారు. ఈ సమావేశంలో కుటుంబ సంక్షేమ డైరెక్టర్ వేమయ్య ముఖ్య అతిథిగా పాల్గొని కుటుంబ సంక్షేమ పథకం వలన కలిగే ప్రయోజనాలను నూతన ఉపాధ్యాయులకు వివరించారు. అనంతరం ఇటీవల మెగా డీఎస్సీ ద్వారా నియమితులైన నూతన ఉపాధ్యాయులను మరియు పనిచేస్తున్న ఉపాధ్యాయులను కూడా ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుటుంబ సంక్షేమ పథకంలో సభ్యులుగా చేర్పించడం జరిగినది. కుటుంబ సంక్షేమ పథకం అనేది రాష్ట్రంలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఉపాధ్యాయ సంఘం మాత్రమే నిర్వహిస్తుందని ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ సుబ్బరాయుడు, సంఘ నాయకులు బాల వెంకటేశ్వర్లు, ఆవుల రాజు, హకీం, మస్తాన్, వెంకటేశ్వర్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా ఉండాలి




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 11)

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ ఒంగోలు నగర శాఖ ఆధ్వర్యంలో స్థానిక కోర్ట్ సెంటర్ నందు నిన్న ఢిల్లీలో రెడ్ ఫోర్ట్ నందు జరిగిన బాంబ్ పేలుడుకు పాలుపడ్డ ఉగ్రవాదులు యొక్క దిష్టిబొమ్మను దహనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ గురునాథ్ మాట్లాడుతూ ఆ యొక్క ఉగ్రవాదులకు కఠిన శిక్ష వెయ్యాలి అని డిమాండ్ చేశాడు . ఈ బాంబు పేలుడులో ఎనిమిది మంది మృతి చెందారు వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ అదేవిధంగా వారి యొక్క కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా ఉండాలని కోరుకుంటున్నానన్నారు. ఈ కార్యక్రమంలో నాగ చరణ్, త్రినాథ్ సాయి అఖిల్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com


# సంగ్రహణాత్మక పరీక్షల పరిశీలన

(షణ్ముఖ వెలుగు, కంభం, నవంబర్ 11)
స్థానిక శ్రీనివాస ఎయిడెడ్ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన సమ్మేటివ్ అసెస్మెంట్-1 పరీక్షలను ఎంఈవోలు అబ్దుల్ సత్తార్, శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మూల్యాంకన పుస్తకాలలోని జవాబులను, రాత నైపుణ్యాలను పరిశీలించి విద్యార్థులకు సూచనలు చేశారు. పరీక్షల ద్వారా విద్యార్థి నైపుణ్యాలను అంచనావేసి గ్రేడ్స్ నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎల్ శ్రీదేవి, ఉపాధ్యాయులు బాలలింగయ్య, టి కోటేశ్వరరావు, జి శ్రీనివాసులు, సిహెచ్ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, నవంబర్ 11)
మండల కేంద్రమైన ఉలవపాడు జివిఎస్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి ఎల్ సుధారాణి అధ్యక్షతన, చరిత్ర విభాగము అధ్యాపకులు సి హెచ్ వెంకటేశ్వర్లు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని, జాతీయ విద్యా విధాన దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగముగా ప్రిన్సిపాల్ ఆజాద్ గురించి మాట్లాడుతూ మొదట జాతీయ విద్యా శాఖ మంత్రిగా, విద్యలో అనేక సంస్కరణలు మార్పులు చేపట్టినారని కొనియాడారు. డాక్టర్ వి శివప్రసాద్ కుమార్ ఆంగ్ల అధ్యాపకులు మాట్లాడుతూ 1992వ సంవత్సరాన భారతరత్న అవార్డు ఇచ్చి భారత ప్రభుత్వం సత్కరించెను. జామియా మిలియా ఇస్లామియా విశ్వవిద్యాలయం ఢిల్లీలో స్థాపించినారని మాట్లాడాను. చరిత్ర శాఖాధిపతి మాట్లాడుతూ 2008 నవంబర్ 11న జన్మదిన రోజున జాతీయ విద్యా దినోత్సవంగా భారత ప్రభుత్వం ప్రకటించెను. ఆజాద్ బహుభాషా కోహిదులుగా ఖ్యాతిఘడించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని జయప్రదం చేశారు.

## ఆర్థిక అక్షరాస్యత పై కళా జాతర




(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, నవంబర్ 11)
మండలంలోని చెరుకూరు గ్రామంలో ప్రకాశం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఆధ్వర్యంలో మంగళవారం ఆర్థిక అక్షరాస్యతపై కళాజాతర నిర్వహించారు. ఒంగోలు పిడిసిసి బ్యాంకు చైర్మన్ కే సీతారామయ్య, డివి శర్మ, ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఆదేశాల మేరకు నా బార్డ్ ఆర్థిక సౌజన్యంతో ఆర్థిక అక్షరాస్యత పై కళాజాతర నిర్వహిస్తున్నట్లు తారక రామ కళాజాతర బృందం తెలిపారు పిడిసిసి బ్యాంక్ ప్రజలకు అందిస్తున్న సేవలు సేవింగ్స్ అకౌంట్స్, బంగారం, వ్యవసాయ రుణాలు, లాకర్ సదుపాయాలు వంటి సేవలను ప్రజలకు వివరిస్తూ చెరుకూరు గ్రామంలో కళాకారులు గ్రామ ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ వడ్డే మాల్యాద్రి, నాయకులు దాసరి తిరపతయ్య, నల్లమోతు వెంకటేశ్వర్లు, సీఈవో జే రాజేశ్వర్‌రెడ్డి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# బాపట్ల జిల్లాలో జరిగిన నష్టాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాం

**కేంద్ర బృందం సభ్యురాలైన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి పౌసుమి బసు**





(షణ్ముఖ వెలుగు, బాపట్ల, నవంబర్ 11)
మొంథా తుపానుకు బాపట్ల జిల్లాలో జరిగిన నష్టాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని కేంద్ర బృందం సభ్యురాలైన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి పౌసుమి బసు తెలిపారు. మొంథా తుపాను దాటికి బాపట్ల జిల్లాలో దెబ్బతిన్న ప్రాంతాలలో కేంద్ర బృందం మంగళవారం పర్యటించింది. కేంద్ర బృందం సభ్యులైన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి పౌసుమి బసు, కేంద్ర ఆర్థిక శాఖ ఎఫ్‌సిడి ఉపసంచాలకులు మహేష్ కుమార్, రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ శశాంక్ శేఖర్‌రాజ్, ఎన్‌ఆర్‌ఎస్ సిఐ ఎస్‌ఆర్‌ఓ శాస్త్రవేత్త సాయి భగీరథ్, రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్‌లు కలిసి చీరాల, వేటపాలెం, కారంచేడు మండలాలలో విస్తృతంగా మంగళవారం పర్యటించారు. తొలుత వేటపాలెం మండలం రామాపురం బీచ్ వద్ద రామాపురం వాడరేవు రహదారిపై 36 మీటర్ల మేర దెబ్బతిన్న రహదారి, కూలిన కల్వర్టును బృందం పరిశీలించింది. పర్యాటకులు నిత్యం సందర్శించే ప్రాంతాలను కలిపే రహదారిపై ఆరుచోట్ల కల్వర్టులు కూలిపోయాయని, రహదారులు పూర్తిగా ధ్వంసం అయ్యాయని కేంద్ర బృందానికి కలెక్టర్ వివరించారు. పొట్టి సుబ్బయ్య పాలెం బీచ్ వద్ద 80 మీటర్ల మేర దెబ్బతిన్న రహదారి, కూలిన కల్వర్టును కేంద్ర బృందం పరిశీలించింది. కారంచేడు మండలం స్వర్ణ గ్రామం రోడ్డులో కొమ్మమూరు కాల్వకు గండ్లు పడిన ప్రాంతాన్ని బృందం సభ్యులు పరిశీలించారు. ఎత్తిపోతల పథకం కింద సాగవుతున్న 150 ఎకరాలు నీట మునిగిన పొలాలను బృందం సభ్యులకు రైతులు చూపించారు. అనంతరం కారంచేడు మండలంలో దెబ్బతిన్న వరి పంట పొలాలను పరిశీలించారు. రైతు అనిల్ పొలంలోకి వెళ్లిన బృందం సభ్యులు వరి పంటను నిశితంగా పరిశీలించారు. ఒక ఎకరాకు 30 నుంచి 33 బస్తాలు వరి దిగుబడు వచ్చే పొలానికి పది ఎకరాలు కూడా రావంటూ రైతు వివరించారు. కారంచేడులోని కప్పల వాగు గండిపడిన ప్రాంతం, జాతీయ రహదారి కోతకు గురైన ప్రాంతాలను కేంద్ర కమిటీ సభ్యులు పరిశీలించారు. కప్పల వాగు, పర్చూరు వాగు కలిసే ప్రాంతంలో దెబ్బతిన్న జాతీయ రహదారి, బ్రిడ్జి, సమీపంలో దెబ్బతిన్న పొలాలు కాల్వ గట్టులను బృందం పరిశీలించింది. పరిశీలనకు వచ్చిన కేంద్ర బృందానికి జిల్లాలో జరిగిన నష్టాన్ని జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ వివరించారు. నష్టం అంచనాలపై రూపొందించిన 60 పేజీల నివేదికను జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ కేంద్ర బృందానికి అందజేశారు. బాపట్లకు అపార నష్టం వాటిల్లిందని కేంద్ర బృందం సభ్యురాలైన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి పౌసుమి బసు అన్నారు. మేము క్షేత్రస్థాయిలో స్వయంగా చూసిన విషయాలను కేంద్రానికి తెలియజేస్తామన్నారు. జల వనరులు, పంచాయతీరాజ్ రహదారులు అధికంగా దెబ్బతినడం బాధాకరమన్నారు. దెబ్బతిన్న ప్రాంతాలన్ని సాధారణ స్థాయికి రావాలంటే అధిక నిధులు అవసరమన్నారు. నష్టం పూడ్చడానికి అవసరమైన నిధులు వచ్చేలా మా వంతు కృషి చేస్తామని తెలిపారు. మొంథా తుపాను ప్రభావంతో బాపట్ల జిల్లాలో 220 గ్రామాలు దెబ్బతిన్నాయని, 30 గ్రామాలు నీట మునిగాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ కేంద్ర బృందానికి వివరించారు. తుపాను దాటికి బాపట్ల జిల్లాకు మొత్తంగా రూ.370.02 కోట్లు నష్టం వాటిల్లిందని కలెక్టర్ చెప్పారులి. 31,490 కుటుంబాలు వివిధ రకాలుగా తుపాను దాటికి నష్టపోగా, 21,894 మంది నిరాశ్రయులై పునరావాస కేంద్రాలలో ఆశ్రయం పొందారన్నారు. 13,974 మత్స్యకార కుటుంబాలు, 8,260 చేనేత కుటుంబాలు నష్టాన్ని చవిచూచాయన్నారు. 13,260 హెక్టార్లలో వ్యవసాయ పంటలు దెబ్బతిన్నాయని చెప్పారు. 18,768 మంది రైతులకు రూ.31.21 కోట్లు నష్టం వాటిల్లిందన్నారు. ఉద్యాన పంటలకు రూ.3.01 కోట్లు నష్టం వచ్చిందన్నారు. జల వనరులశాఖకు చెందిన చెరువులు, పంట కాల్వలు 365 ప్రాంతాలలో దెబ్బతినడంతో రూ.53.04 కోట్లు నష్టం వచ్చిందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో 76 రహదారులు 147.86 కిలోమీటర్ల మేర దెబ్బతినగా, పంచాయతీరాజ్ కు రూ.76 కోట్లు నష్టం వాటిల్లిందన్నారు. 147.86 కిలో కిలోమీటర్ల మేర ఆర్ అండ్ బి రహదారులు దెబ్బతిన్నాయని, రూ.139 కోట్లు నష్టపోయామన్నారు. మిగిలిన అంశాలోనూ దెబ్బతిన్నట్లు వివరించారు. తాత్కాలిక పద్ధతిలో పునరుద్ధరణకు ప్రాథమికంగా అంచనాలు వేశామన్నారు. శాశ్వత ప్రాతిపదికన కల్వర్టులు, రహదారులు, చెరువులు, కాల్వలు పునరుద్ధరించాలంటే అధిక నిధులు అవుతాయని కేంద్ర బృందానికి కలెక్టర్ విన్నవించారు. నష్టపోయిన బాపట్ల జిల్లాను అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. బృందం వెంట అనుబంధ శాఖల జిల్లా అధికారులు, చీరాల, బాపట్ల ఆర్డీవోలు టి చంద్రశేఖర్, పి గ్లోరియా, తదితరులు ఉన్నారు.

## హైదరాబాదులో నవంబర్ 19న కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి 41 వర్ధంతి సభను జయప్రదం చేయండి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 11)
దేశంలో వ్యవసాయాన్ని కార్పోరేటీకరించడం, ముఖ్యంగా భూముల్ని బలవంతంగా సేకరించి కార్పొరేట్లకు కట్టబెడుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా పోరాడటమే కాకుండా, భూస్వామ్య, పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద కూటమికి వ్యతిరేకంగా ప్రతిఘటనోద్యమాన్ని నిర్మాణం చేయడమే కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డికి అర్పించే నిజమైన నివాళి అని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్టిపాటి వెంకటేశ్వర్లు అన్నారు. సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో నవంబర్ 19 న హైదరాబాద్‌లో జరుగు కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి 41వ వర్ధంతి సభను జయప్రదం చేయాలని, ఒంగోలులోని మాదాల నారాయణ స్వామి భవన్ లో పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా కామ్రేడ్ చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దళిత, గిరిజనుల సమస్యలను పరిష్కారం చేయకుండా ఆపరేషన్ కగార్ తీసుకువచ్చి అడవుల్లో ఉన్న గిరిజనులను, ఆదివాసీలను ఎన్‌కౌంటర్ చేస్తున్నారన్నారు. గత 25 సంవత్సరాలుగా ఆదివాసీల పోరాటాల ఫలితంగా 25 లక్షల పోడు భూములను పార్టీ గిరిజనులకు పంచిందన్నారు. కాని అధికారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక ఎకరం భూమి కూడా పేదలకు పంచింది లేదన్నారు. కనుక పేద ప్రజలకు అండగా నిలబడుతున్న సిపిఐ (ఎంఎల్), న్యూడెమోక్రసీ లాంటి పార్టీలకు అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి సిఎస్ సాగర్, జిల్లా కమిటీ నాయకులు బి పద్మ, సిహెచ్ మోహన్, కొంగర నరసింహం, జాలన్న, దారా సుబ్బారావు, సి తిరుమలరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ నాన్ గజిటెడ్, గజిటెడ్ పొదిలి తాలూకా యూనిట్ అసోసియేషన్ ఎన్నికలు

(షణ్ముఖ వెలుగు, పొదిలి, నవంబర్ 11)




ఏపీ నాన్ గెజిటెడ్, గజిటెడ్ ఉద్యోగుల అసోసియేషన్ పొదిలి తాలూకా యూనియన్ ఎన్నికల షెడ్యూల్‌ను కంభం తాలూకా అధ్యక్షుడు ఎన్నికల అధికారి వి రాధాకృష్ణమూర్తి ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడం జరిగింది. ఈ నెల 21 తేదీన నామినేషన్ ప్రక్రియ మొదలు పెట్టనున్నట్లు తెలియజేశారు. ఈ నామినేషన్ ప్రక్రియలో పొదిలి, కొనకమిట్ల, మర్రిపూడి మండలాల్లోని ఉద్యోగులు పాల్గొనాలని తెలిపారు. ఈ విషయాన్ని పొదిలి తాలూకా యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు లేల్ల శ్రీనివాస్‌రెడ్డి, సంధాని భాషలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నిక ప్రక్రియలో భాగంగా పొదిలి తాలూకాకు అధ్యక్షుడు, సహాధ్యక్షుడు, కార్యదర్శి ఉపాధ్యక్షులు, సంయుక్త కార్యదర్శులు, కోశాధికారి పదవులకు ఈ నెల 28వ తేదీన పొదిలి ఎన్‌జిఓ కార్యాలయంలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికలకు సహాయ అధికారిగా ఎం సుభాని, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శరత్, ఆర్ సిహెచ్ కృష్ణారెడ్డి తెలిపారు.

## జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 11)
స్వాతంత్ర్య సమరయోధుడు, భారత దేశ తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి ఒంగోలులోని ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు షేక్ సైదా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబుల్ కలాం ఆజాద్ భారత దేశానికి 11 సంవత్సరాలు పాటు విద్యా శాఖ మంత్రిగా పని చేశారని కొనియాడారు. మింటో సంస్కరణల ఫలితంగా రెండు వర్గాల మధ్య చెలరేగిన సంఘర్షణల తర్వాత హిందూ మతము ముస్లిం వర్గాల మధ్య ఐక్యత కుదర్చడంలో కీలకపాత్ర పోషించారు అని గుర్తుచేశారు. యర్రగొండపాలెం నియోజకవర్గ సమన్వయకర్త పాలపర్తి విజేష్ రాజ్ మాట్లాడుతూ అబుల్ కలాం ఆజాద్ స్వతంత్ర పోరాటంలో ఎంతో కీలక పాత్ర పోషించి అనేక మార్లు జైలులో జీవితం గడిపారు అని అన్నారు. ముస్లిం సమాజంలో ఎంతో ఉన్నత విద్య అభ్యసించి బడుగు బలహీన వర్గాలకు, మైనారిటీలకు స్ఫూర్తిగా నిలిచారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో %ఖఖజ% రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెలగతోటి సుధీర్ వర్మ, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గోరంట్ల కోటేశ్వర రావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ రావుఫ్, సుదీప్, యలమంద, చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలి

## ఏపీ రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ గంజిమాల దేవి





(షణ్ముఖ వెలుగు, బాపట్ల, నవంబర్ 11)

ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలని ఏపీ రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ గంజిమాల దేవి తెలిపారు. బాపట్ల, వేటపాలెం చిన్నగంజాం మండలాలలో ఆమె మంగళవారం విస్తృతంగా పర్యటించారు. పాడిసన్ పేట విలేజ్, బాపట్ల మండలం చౌక ధర దుకాణం పరిశీలించారు. కొండుబోట్లపాలెం గ్రామంలోనూ చౌక ధర దుకాణం పరిశీలించారు. భరత్ నగర్ కాలనీ, కోండ్బాట్లపాలెంలోని అంగన్వాడీ కేంద్రం పరిశీలించారు. లబ్ధిదారులకు సరుకులు ఏమి ఇవ్వడం లేదని కార్యకర్తకు మెమో ఇవ్వాలన్నారు. కొమ్మరెత్తి వెంకయ్య అండ్ కోటమ్మ మెమోరియల్ జడ్పీహెచ్ఎస్ స్కూల్ , కొండుబాట్లపాలెం విలేజ్ బాపట్ల మండలం రాగిజావ పిండి ఉడకలేదు. పిల్లలందరూ తాగడం లేదు. కొంతమంది విద్యార్థులు మధ్యాహ్నం లంచ్ బాక్స్



తెచ్చుకుంటున్నారు. నాణ్యత లేక పోవడంతోనే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని హెచ్ఎం కి షోకాస్ నోటీస్ ఇవ్వాలన్నారు. ఏ జీ కాలేజ్ రోడ్డులోని సరస్వతి స్మారక గవర్నమెంట్ గర్ల్స్ యూపీ స్కూల్‌లో 548 విద్యార్థినీలకు గాను 259 మంది విద్యార్థినిలు మాత్రమే స్కూల్లో మధ్యాహ్నం భోజనం తీసుకుంటున్నారు. హెచ్ఎం కి షోకాస్ నోటీస్ ఇవ్వాలన్నారు. అక్బర్ పేట అంగన్వాడి కేంద్రం, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం పాఠశాల, మున్సిపల్ యుపి స్కూల్, కొండుబోట్ల పాలెం ప్రభుత్వ బదిరుల ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు. వేటపాలెం మండలంలోని ఎంజెఏబిసి డబ్ల్యూ ఆర్ బాలుర పాఠశాల, అంగన్వాడి కేంద్రం, చిన్నగంజాం మండలం సంతరావూరు గ్రామంలో అంగన్వాడి కేంద్రం పరిశీలించారు. టీచర్ ధనలక్ష్మి షోఖాజ్ నోటీస్ ఇవ్వాలన్నారు. ఆయన వెంట మహిళ స్త్రీ శిశు సంక్షేమశాఖ పీడీ రాధా మాధవి, తదితరులు ఉన్నారు.

# ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

### ప్రతి బాలుడు విద్య నేర్చుకుంటే భారత్ బలపడుతుంది

### చైర్మన్ అబ్దుల్ గఫార్ షేక్



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, నవంబర్ 11)

ప్రతి బాలుడు విద్య నేర్చుకుంటే భారత్ బలపడుతుందిని చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ అన్నారు. జాతీయ విద్యా దినోత్సవమును పురస్కరించుకొని మంగళవారం కనిగిరి పట్టణంలోని నాలుగో వార్డు ప్రభుత్వ ఉర్దూ ప్రాథమికొన్నత పాఠశాలనందు ప్రభుత్వ మైనారిటీ శాఖ ఆదేశాల మేరకు విద్యాశాఖ, కెఎస్ఎం ఎడ్యుకేషన్ సొసైటీ, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ భారతదేశ తొలి విద్యామంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం నవంబర్ 11న జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటారని అన్నారు. విద్య అనేది కేవలం పుస్తక జ్ఞానం మాత్రమే కాదని మనిషి వ్యక్తిత్వాన్ని, మనసును సమాజాన్ని మలిచే శక్తి అని అన్నారు. విద్య ద్వారా ప్రతి వ్యక్తి చైతన్యవంతుడవుతాడని, సమాజ అభివృద్ధి దిశగా ముందడుగు వేయగలడని పేర్కొన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశ విద్యా వ్యవస్థకు పునాది వేసిన గొప్ప విద్యావేత్త అని, ఆయన స్ఫూర్తితో ప్రతి విద్యార్థి విద్యలో కృషి చేయాలని, ఉపాధ్యాయులు విద్యార్థుల్లో జ్ఞానోదయాన్ని కలిగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వక్తలు విద్య ప్రాముఖ్యతపై అవగాహన నిర్వహించారు. అనంతరం ఉర్దూ పాఠాశాలల ఉపాధ్యాయులైన ఎస్ కె సనావుల్లా, షహనాథ్ బాను, మూడవ వార్డు ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పఠాన్ జైనాబి, పిఎం ప్రభుత్వ బాలికల పాఠశాల ఉపాధ్యాయురాలు హాని పున్నిసాలను ఘనంగా సన్మానం చేసి పిల్లలకు స్వీట్స్ పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్‌కె సనావుల్లా, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ మంద్రు రమేష్ బాబు, ఉపాధ్యాయులు నారాయణ, పవన్ కుమార్, అనురాధ, వసంత కుమారి, తదితరులు పాల్గొన్నారు.

# ఒంగోలు జిజిహెచ్ (రిమ్స్)లో అందుబాటులోకి యూరాలజీ శస్త్ర చికిత్స

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 11)



పెద్ద కార్పొరేట్ ఆసుపత్రుల్లో మాత్రమే లభ్యం అయ్యే యూరాలజీ శస్త్ర చికిత్స పరికరాలు ఇప్పుడు ఒంగోలు జిజిహెచ్ (రిమ్స్)లో అందుబాటులోకి వచ్చాయని, ప్రభుత్వం రూ.2 కోట్లు వెచ్చించి మూడు ముఖ్యమైన పరికరాలు జిజిహెచ్ ఒంగోలుకు కేటాయించడం శుభపరిణామం అని జిజిహెచ్ సూపరెంటెండెంట్ డాక్టర్ ఎస్ మాణిక్యరావు అన్నారు. జిజిహెచ్ యూరాలజీ విభాగానికి ప్రభుత్వం సమకూర్చిన యూరో డైనమిక్ సిస్టం, డస్ట్ లేజర్ పరికరం, క్యాంటాలితో అనే పరికరాలను ఒంగోలు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్ కుమార్‌తో కలిసి అయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ పరికరాల ద్వారా నొప్పి అధిక రక్త స్రావం లేకుండా, మూత్రాశయ పనితీరు పరీక్ష, లేజర్ ద్వారా రాళ్లను తొలగించడం లేదా చిన్నవిగా చేయడం లాంటి ప్రయోజనాలు పేషంట్లకు లభిస్తాయంని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో రెండు కాలేజీలకు మాత్రమే ఈ పరికరాలను సమకూర్చించి అని అందులో ఒంగోలు జి జి హెచ్ ఉందన్నారు. ఈ పరికరాలు త్వరలో పేషంట్లకు అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ అశోక్ కుమార్ మాట్లాడుతూ అనేక అధునాతన పరికరాలు అందుబాటులోకి వస్తున్నాయని, వీటి వినియోగం పని తీరు పట్ల నిరంతరం తర్ఫీదు పొందాలన్నారు. తద్వారా ప్రజలు కు మెరుగైన సేవలు అందించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో యూరాలజీ విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గోలిమి కిరణ్, డిప్యూటీ సూపరెంటెండెంట్ డాక్టర్ ఏడుకొండలరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, సీఎస్ఆర్ ఎంవో డాక్టర్ మాధవీలత, ఒబిజి హెచ్‌వోడీ డాక్టర్ సంధ్యారాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్ మాలకొండారెడ్డి, డాక్టర్ రసూల్, తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక విద్యకు ఆద్యుడు అబుల్ కలాం ఆజాద్

## వైసీపీ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్




(షణ్ముఖ వెలుగు, కందుకూరు, నవంబర్ 11)

దేశంలో విద్యాభివృద్ధికి విశేష కృషి చేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతిని కందుకూరు పామురోడు లోని వైఎస్ఆర్సిపి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ పాల్గొని మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం ఏర్పడిన మొదటి ప్రభుత్వంలో సుదీర్ఘంగా 11 సంవత్సరాలపాటు విద్యాశాఖామంత్రిగా పనిచేసి దేశంలో విద్యా సంస్కరణలకు విశిష్టమైన కృషిచేశారు. దేశంలో సమగ్ర విద్యా విధాన రూపకల్పనకు పునాదులు వేశారని అన్నారు. ముందుగా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు షేక్ రఫీ, కందుకూరు మండలం అధ్యక్షులు ఈదర రమేష్, వలేటివారిపాలెం మండలం అధ్యక్షులు అనుమోలు లక్ష్మీనరసింహం, ఉలవపాడు మండలం అధ్యక్షులు నన్నం పోతురాజు, లింగసముద్రం మండలం అధ్యక్షులు నోటి వెంకటేశ్వరరెడ్డి, తోకల కొండయ్య, గణేశం గంగిరెడ్డి, ముప్పవరపు కిషోర్, రావులకొల్లు బ్రహ్మానందం, పెన్నా కృష్ణయ్య, పులి రమేష్, బిల్లా రమణయ్య, గేరా మనోహర్, తల్లపనేని గోపి, పాలవల్లి అమర్నాథ్‌రెడ్డి, కూరపాటి వెంకట్రామిరెడ్డి, జిల్లెలముడి కోటేశ్వరరావు, చింతలపూడి సుధాకర్, సయ్యద్ దస్తగిరి సాహెబ్, షేక్ రహీం, అమ్మనబ్రోలు బ్రహ్మయ్య, కోటు కోటిలింగం, కోటు కోటయ్య, అమ్మనబ్రోలు వెంగళరావు, దగ్గుమాటి కోటయ్య, వేణుగోపాల్‌రెడ్డి, వాకా శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్లతో ప్రమాద నివారణ చర్యలు

### సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం

### నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠినమైన చర్యలు


### ఎస్ఐ కె అంకమ్మ



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, నవంబర్ 11)

మండల కేంద్రమైన ఉలవపాడులో మంగళవారం ఆటో డ్రైవర్లతో ప్రమాదాలు నివారణ చర్యల భాగంగా మద్యం తాగి నడపడం, పరిమితికి మించి ఆటోలో ఎక్కువమందిని ఎక్కించుకోవడం, ముందు సీట్లో అటు ఇటు కూర్చోబెట్టుకోవటం, సౌండ్ బాక్స్ అమర్చుటం హైవేపై అతివేగంగా నడపడం రైతు కూలీలను 15 నుంచి 20 మంది దాకా ఎక్కించుకొని కూలి పనులకు తీసుకెళ్లడం సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయటం డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి ఆటో ఇచ్చి నడపటం మైనర్ బాలులతో ఆటో నడిపించడం మరియు సైబర్ నేరాలపై ఉలవపాడు ఎస్సై గారు అవగాహన కార్యక్రమం నిర్వహించడం అయినది మరియు పై నిబంధనలను అతిక్రమించినచో వారిపై పోలీసు వారు కఠిన చర్యలు తీసుకోబడును.


# రాష్ట్ర మంత్రి పార్థసారథిని ఆహ్వానించిన యాదవ సామాజిక వర్గం



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, నవంబర్ 11)

శ్రీ వేణు తుల కాటంరాజు గంగాభవాని దేవస్థానం వద్ద ప్రకాశం జిల్లా స్థాయి యాదవ సామాజిక వర్గం కార్తీక వనభోజనాల కార్యక్రమం సంబంధించి రాష్ట్ర మంత్రి యాదవ శ్రేష్ట కొలుసు పార్థసారథి యాదవ్‌ని ప్రకాశం జిల్లా యాదవ సంఘాల ఐక్యవేదిక సభ్యులు ఆహ్వానించారు. ఆహ్వానం పలికిన వారిలో ప్రకాశం జిల్లా యాదవ సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు సిరిపురం వెంకట్రావు యాదవ్, కాటమరాజు దేవస్థాన కమిటీ చైర్మన్ గుమ్మా గంగరాజు యాదవ్, యాదవ సంఘ శ్రేయోభిలాషి బైరబోయిన చంద్రశేఖర్ యాదవ్, ఒంగోలు అమ్మవారి దేవస్థానం చైర్మన్ గోల్ల వెంకటేశ్వర్లు యాదవ్, కాటమరాజు దేవస్థాన కమిటీ ఉపాధ్యక్షులు అల్లంరాజు శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ నక్క శ్రీనివాస్ యాదవ్, మోరబోయిన బాబురావు యాదవ్, పల్లా నరసింహారావు యాదవ్, ఒంగోలు వీరయ్య యాదవ్, తలమల శ్రీనివాస్ యాదవ్, నరసింహారావు యాదవ్, తదితర యాదవ సంఘం బాధ్యులు. మంత్రిని ఆహ్వానించిన పిమ్మట రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ యాదవ్‌ను కూడా కలిసి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా నాయకులు తాము వీలున్నంతవరకు తమ ప్రాంతాల్లో ఉన్నటువంటి కార్యక్రమాలను చూసుకొని కాటమరాజు దేవస్థానం వద్దకు చేరుకుంటామని తెలియజేశారు.


# మద్దిపాడు మండల తెలుగు యువత అధ్యక్షుడిగా నల్లూరి శ్రీనివాసరావు



(షణ్ముఖ వెలుగు, మద్దిపాడు, నవంబర్ 11)

మద్దిపాడు మండల తెలుగు యువత అధ్యక్షుడిగా నల్లూరి శ్రీనివాసరావు కి ఇవ్వటం జరిగింది. మంగమూరు రోడ్డు మర్రిచెట్టు వద్ద ఎమ్మెల్యే నివాసంలో సంతనూతలపాడు శాసనసభ్యులు బి ఎన్ విజయ్ కుమార్‌ని కృతజ్ఞతలు తెలుపుతూ శాలువాతో సత్కరించారు, అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ తన మీద నమ్మకంతో పదవి వచ్చేందుకు కృషి చేసిన పోతినేని శ్రీనివాసరావుకి, మండల నాయకులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. మండలంలో యువతను కలుపుకుంటూ పార్టీ కోసం కష్టపడతానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఉప్పుగుండూరు నాగేశ్వరరావు, గట్టినేని అయ్యన్న, తదితరులు నల్లూరి శ్రీనివాసరావుకి శుభాకాంక్షలు తెలిపారు.

# వైసీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 11)

మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఒంగోలులో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు.జిల్లా కోర్టు ఆవరణం నందు జరిగిన కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.లీగల్ సెల్ అధ్యక్షులు నగిరికంటి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైసీపీ జిల్లా అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి న్యాయవాదులు నుంచి సంతకాల సేకరణ చేపట్టారు.అనంతరం బూచేపల్లి మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి పేద విద్యార్థుల వైద్య కోసం మెడికల్ కళాశాలలను తీసుకువస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిని ప్రవేటీకరణ చేస్తుందని ఆరోపించారు.80 శాతం పూర్తి అయిన కళాశాలలను కూడా నేడు ప్రవేటు వ్యక్తులకు అప్పగిస్తున్నారు అని బూచేపల్లి మండిపడ్డారు.ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మార్కాపురం సమన్వయకర్త అన్నా రాంబాబు, ఒంగోలు సమన్వయకర్త చుండూరి రవిబాబు, సిటీ ప్రెసిడెంట్ కటారి శంకర్, కనకారావు మాదిగతో పాటు పార్టీ నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

# ఒంగోలు పాత మార్కెట్ ఆజాద్ విగ్రహం వద్ద అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్11)

ఒంగోలు పాత మార్కెట్ ఆజాద్ విగ్రహం వద్ద రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు భారత దేశపు ప్రఖ్యాత స్వాతంత్ర్య సమరయోధుడు, మహా విద్యావేత్త, భారత దేశ మొదటి విద్యామంత్రి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా డీఆర్వో ఓబులేసు, రాష్ట్ర మైనారిటీ కమిషన్ సభ్యులు కఫిల్ బాషా, ప్రకాశం జిల్లా టీడీపీ ముస్లిం మైనారిటీసెల్ అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్, అజిమున్నిసా, పలువురు ప్రముఖ నాయకులు, మైనారిటీ విభాగ నాయకులు, కార్యకర్తలతో కలిసి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. షేక్ రసూల్ మహమ్మద్ మాట్లాడుతూ "మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ గారు భారత స్వాతంత్ర్య ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన మహానుభావులు. విద్యా రంగంలో ఆయన చూపిన దూరదృష్టి కారణంగానే నేటి భారత్ విద్యారంగంలో ఉన్నత స్థానాన్ని పొందింది. భారత ప్రభుత్వ మొట్ట మొదటి విద్య శాఖ మంత్రిగా 11 సంవత్సరాలు పనిచేసారు. ఆయన ఆలోచనలు, స్ఫూర్తి ప్రతి భారతీయుడికి ఆదర్శం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పలు నాయకులు పాల్గొని మౌలానా ఆజాద్ సేవలను స్మరించారు.

# స్వచ్ఛభారత్ సామాజిక బాధ్యత ఉపకులపతి ప్రొఫెసర్ డివిఆర్ మూర్తి





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 11)

స్వచ్ఛభారత్ యాక్షన్ ప్లాన్ ఎన్ఎస్ఎస్ రీజినల్ డైరెక్టర్ వారి సౌజన్యంతో ఏ మస్వ్ క్లీనింగ్ ప్రోగ్రాం ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్ నందు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ డివిఆర్ మూర్తి హాజరై మాట్లాడుతూ స్వచ్ఛభారత్ కార్యక్రమం అనేది ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని, ఈ కార్యక్రమం ప్రతి పురజనులు, విద్యార్థుల, వైద్యుల, న్యాయవాదుల, ఉద్యోగస్తుల, మహిళలు అందరూ వ్యక్తిగతంగా శ్రద్ధ వహించి సమాజ పరిశుభ్రత పాటిస్తూ చెట్లు పెంచుతూ వాతావరణ సమతుల్యత కాపడుకోలన్నారు. అలాగే వికసిత్తు భారత్ 2044 నాటికి భారతదేశం స్వచ్ఛభారతదేశం గాను, స్వర్ణ భారతదేశం గాను, కాలుష్యం లేని అభివృద్ధి చెందిన దేశం గాను రూపాంతరం చెందాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని క్లీన్ ఇండియాగా ఉండాలని పేర్కొన్నారు. మరొక విశిష్ట అతిథి ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఎస్ ఎస్ఎన్ డిగ్రీ కాలేజీ వాలంటీర్స్, ఏపీఎస్ ఆర్టీసీ ఒంగోలు డిపో మేనేజర్ ఘట్టమనేని శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొని స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమం ఇతరులకు ప్రేరణ, ఆదర్శంగా ఉండాలని ఆశిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణ కర్త, అధ్యక్షులు ఆంధ్ర కేసరి ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మండే హర్ష ప్రీతం దేవ్ కుమార్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం స్వచ్ఛభారత్ మిషన్ ఎన్ఎస్ఎస్ రీజినల్ డైరెక్టర్ హైదరాబాద్ వారి సౌజన్యంతో ముందుకు సాగిందన్నారు. ఈ కార్యక్రమం పర్యవేక్షకులు ఎన్ఎన్ సంజయ్ కుమార్ హైదరాబాదు నుండి వచ్చి వ్యక్తిగతంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. అలాగే స్వచ్ఛభారత్ యాక్షన్ ప్లాన్ దేశవ్యాప్తంగా ప్రజలను చైతన్యం చేస్తుందని, గ్రామాలలో భాగస్వామ్యంగా ఉండి అభివృద్ధికి పాటుపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మరొక ప్రత్యేక ఎన్ఎస్ఎస్ రీజినల్ డైరెక్టర్ హైదరాబాద్ ప్రతినిధి మాట్లాడుతూ స్వచ్ఛభారత్ యాక్షన్ ప్లాన్ ద్వారా సమాజంలో చైతన్యం తీసుకురావడం ప్రజలు నివసించే ప్రాంతాలను వారే శుభ్రపరచుకొని వారి సమస్యలను వారే తెలుసుకొని పరిష్కరించుకోవాలని, దానికి ఎన్ఎస్ఎస్ ఒక వేదిక అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి ఎస్ఎన్ కాలేజీ వాలంటీర్లు, ఆంధ్ర కేసరి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గవర్నమెంట్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్, అలీ బాబా ప్రోగ్రాం ఆఫీసర్ డి నరహరి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎస్ఎన్ కాలేజ్ ప్రోగ్రామ్ ఆఫీసర్ టి రాజేంద్ర బాబు, ఏపీఎస్ఆర్టీసీ సిబ్బంది, ఏకేయూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కేకే రెహమాన్ నలిని గ్లోరీ ఫిషర్స్ డెపార్ట్మెంట్, సురేష్, పాల్గొని ప్రోగ్రాములు విజయవంతం చేశారు.

# చిన్నారుల బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దే

## గురుతర బాధ్యత ఉపాధ్యాయుల పై ఉంది

## మార్కాపురం ఎమ్మెల్యే కందుల









(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, నవంబర్ 11)

చిన్నారుల బంగారు భవిష్యత్‌ను తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయుల పై ఉందని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని జడ్పీ బాయ్స్ హైస్కూల్లో మంగళవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన 2025 డీఎస్సీ నూతన ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులకు మొదటిగా శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషి జీవితంలో మూడు దశలు ఉంటాయని, వాటిలో అత్యంత కీలకమైన విద్యార్థి దశలో విద్యార్థులకు దగ్గరుండి వారికి విద్యాబుద్ధులు నేర్పి సరైన నడక అలవర్చి వారిని భవిష్యత్తు ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులు పైనే ఉంటుందన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులకు ఇష్టపడి పాఠాలు నేర్పాలని, తద్వారా విద్యార్థులు కూడా ఇష్టపడి పాఠాలు నేర్చుకుంటారన్నారు. విద్యాపరంగా కూడా పశ్చిమ ప్రకాశం ఎంతో వెనుకబడి ఉన్నదని త్వరలో ఏర్పడబోయే మార్కాపురం జిల్లాలో విద్యతోనే ఈ ప్రాంత అభివృద్ధి సాధ్యమని ఈ ప్రాంత అభివృద్ధి బాధ్యత ఉపాధ్యాయుల పైనే ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, యుటిఎఫ్ నాయకులు, నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

# విద్యావేత్త మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు మరువలేనివి



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, నవంబర్ 11)

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు,దేశ తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు మంగళవారం ఏ1 గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్ అలీబెగ్ ప్రసంగిస్తూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు మరువలేనివి అన్నారు. అలాగే దేశ తొలి విద్యా శాఖ మంత్రి గా విద్యా రంగంలో అనేక సంస్కరణలు చేపట్టిన గొప్ప విద్యా వేత్త అని ఆయన సేవలను కొనియాడారు. ఆ మహనీయుని ఆదర్శాల కోసం నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్ర పటానికి చైర్మన్ అలిభేగ్, కళాశాల డైరెక్టర్ మీర్జా మహమ్మద్ మసూద్ అలీబెగ్, ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ శ్రీధర్‌లు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బిఈడి కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌కె మహమ్మద్ రఫీ, సిబ్బంది పాల్గొన్నారు.

# మండల సమాఖ్య ఈసీ మెంబర్లకు శిక్షణ పాల్గొన్న 11 మండలాల సిబ్బంది





(షణ్ముఖ వెలుగు, పొదిలి, నవంబర్ 11)

పట్టణంలోని వెలుగు డిఆర్డిఏ ఆఫీసు నందు యాన్యువల్ యాక్షన్ ప్లాన్, బిజినెస్ డెవలప్మెంట్ ప్లాన్ పైన 11 మండలాల సిబ్బంది , పొదిలి మండల సమాఖ్య ఈసీ మెంబర్లకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. మొదటి రోజులో భాగంగా అందరిని 6 గ్రూపులుగా ఏర్పాటు చేసి వారి ద్వారానే చార్టు పైన ఒక గ్రూపు సభ్యురాలు అవసరాలు, ఆ గ్రామ సంఘ అవసరాలు ఏముంటాయని చార్టల రూపంలో రాసి చర్చించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ లక్ష్మీ రెడ్డి పాల్గొని గ్రామ సంఘ సభ్యులకు అవసరాలను యాక్షన్ ప్లాన్ ద్వారా తయారు చేసుకొని వాటిని బిజినెస్ రూపంలో తయారు చేయాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పొదిలి, దొనకొండ, కురిచేడు, మద్దిపాడు, చీమకుర్తి, వెలిగండ్ల, పొన్నలూరు, కొండేపి, సింగరాయకొండ, రాచర్ల, తర్లుపాడు మండలాల ఏపిఎంలు, ఎల్‌సిలు, సీసీలు, అకౌంటెంట్లు, జిల్లా ఐబి యాంకర్ పర్సన్ ఆదిశేషయ్య, ట్రైనర్స్ నాగులప్పలపాడు ఏపీఎం నరేంద్ర, అర్ధవీడు ఏపిఎం రమేష్, పొదిలి ఏపిఎమ్ గోపాలకృష్ణ, సమాఖ్య అధ్యక్షురాలు మెహరున్నిసా, సెక్రెటరీ సులోచన, కోశాధికారి





On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com